ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం: 42.0
కనిష్ఠం: 26.0



వైఎస్ఆర్ జలయజ్ఞమేది?

- చింతలపూడి, పోలవరంను పూర్తి కాకుండా చేశారుగా..
- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇవన్నీ పూర్తి చేస్తాం
- ఎమ్మెల్యేలకు సీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వరా...?
- దెందులూరు ఎమ్మెల్యేదీ మట్టి దోపిడీ
- చింతలపూడి, గోపన్నపాలెం సభల్లో షర్మిల

ఏలూరు/చింతలపూడి/దెందులూరు ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి):'వైఎస్ఆర్ కలలు కన్న జలయజ్ఞం ఇక్కడ జరగలేదు. లక్షలాది ఎకరాలకు సాగు నీరు అందించే చింతలపూడి ఎత్తిపోతలకు అతీగతీ లేదు. ఈ ఐదేళ్లలో కనీసం తట్టెడు మట్టి తీసిన పాపాన పోలేదు. జగన పాలనలో ఇలా అంతటా నిర్లక్ష్యమే జరిగింది' అని పీసీసీ చీఫ్ షర్మిల విరుచుపడ్డారు. సాగునీటి ప్రాజెక్టులే కాదు రైతులను విస్మరించారని దుయ్యబట్టారు. న్యాయ బస్ యాత్రలో భాగంగా శుక్రవారం చింతలపూడి సెంటర్, దెందులూరు నియోజక పరిధిలోని గోపన్నపాలెంలో జరిగిన సమావేశాల్లో ఆమె జగన్ పాలనపై విరుచుపడ్డారు. 'చింతలపూడి సిట్టింగ్ ఎమ్మెల్యే ఎలీజాను ఉద్దేశించి.. కాంగ్రెస్‌లోకి ఎందుకు వస్తున్నారని అడిగా. ఆయనేమో ఐదేళ్ల ఎమ్మెల్యేగా ఎందుకు ఉన్నానో తెలీదన్నారు. కనీసం రోడ్లు వేయిద్దామంటే నిధులు ఇవ్వలేదన్నారు. కనీసం జగన్ అపాయింట్‌మెంట్ అడిగితే ఒక్కసారి అవకాశం రాలేదన్నారు. ఇదీ జగన్ పాలన వ్యవహారమ'ంటూ షర్మిల తప్పుపట్టారు. అలసిపోయి ఇంకా వైసీపీలోనే ఉంటే చింతలపూడి పథకం పూర్తి కాదని భావించి కాంగ్రెస్‌లో చేరాడు. చింతలపూడి ప్రాజెక్టును పూర్తి చేయలేక జగన్ ఎప్పుడో చేతులెత్తేశారని దుయ్యబట్టారు. గట్టిగా కొట్లాడే గొంతు ఇంతకాలం రాష్ట్రంలో లేదు. హోదా ఇస్తామని కాంగ్రెస్ ఇచ్చిన మాట పట్టుకుని మరీ ఇక్కడకు వచ్చా. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే హోదా పదేళ్లు ఇస్తామని షర్మిల ప్రకటించారు. దెందులూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరిపైనా విరుచుకుపడ్డారు. పేకాట, కోడి పందేలు మూడు పువ్వులు, ఆరు కాయలుగా ఉంది. నియోజకవర్గంలో మట్టి మొత్తం దోచేశారు. కొల్లేరు సమస్యను పట్టించుకోలేదు. ఎందుకు మరీ మీ ఎమ్మెల్యే..? కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పోలవరం ప్రాజెక్టును పూర్తిచేస్తాం. చింతలపూడి ఎత్తిపోతలను పూర్తి చేసి నీరందిస్తాం. 2.25 లక్షల ఉద్యోగాలు తక్షణం భర్తీ చేస్తాం. మహిళలకు ఏడాదికి లక్ష ఆర్థికసాయం చేస్తాం. పేద మహిళల పేరు మీద 5 లక్షలతో పక్కా ఇళ్లను కట్టించి ఇస్తాం. ప్రజల కోసం పనిచేసేది పార్టీ కాంగ్రెస్ ఒక్కటే అని షర్మిల అన్నారు. చింతలపూడి, దెందులూరు కాంగ్రెస్ అభ్యర్థులు ఎలీజా, ఆలపాటి నరసింహమూర్తి, ఏలూరు ఎంపీ అభ్యర్థి కావూరి లావణ్యలను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సీపీఎం నాయకులు ఎ.రవి, సీపీఐ నాయకులు కృష్ణచైతన్య మాట్లాడుతూ ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఎంపీ అభ్యర్థి లావణ్య మాట్లాడుతూ ప్రత్యేక హోదా, రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు, కాంగ్రెస్ వల్లే సాధ్యమన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు, సత్యేంద్రబాబు, కాశీ, ప్రసాద్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు విస్సంపల్లి సుందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


చింతలపూడి సభలో ప్రసంగిస్తున్న షర్మిల


గోపన్నపాలెం సభకు హాజరైన జనం

ట్రాఫిక్‌లో షర్మిలను పట్టించుకోని పోలీసులు

ఏలూరు జిల్లా పర్యటనలో పీసీసీ చీఫ్ షర్మిల పర్యటనకు అడుగడుగునా అవాంతరాలు సృష్టించే ప్రయత్నం జరిగింది. గోపన్నపాలెం జంక్షన్‌లో ఎన్నికల ప్రచార సభ ముగించుకుని తిరిగి వెళ్లే క్రమంలో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. గంటకు పైగా షర్మిల ఆ ప్రాంతం నుంచి ముందుకు కదలలేక వాహనంలోనే ఉండిపోయారు. కనీసం ట్రాఫిక్ క్లియర్ చేయడానికి ఒక్క పోలీసు అందుబాటులో లేనేలేరు. ఈ నిర్లక్ష్యంతో షర్మిల తీవ్ర ఆగ్రహం చెందారు. జిల్లా ఎస్పీని సంప్రదించేందుకు షర్మిల ప్రయత్నించగా స్పందన లేకపోవడంతో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. అప్పుడు గాని కొంతలో కొంత పోలీసుల్లో కదలిక వచ్చినా ఆ లోపు స్థానికులు కలుగ చేసుకుని ట్రాఫిక్ క్లియర్ చేయడంతో శుక్రవారం రాత్రి 9 గంటలకు షర్మిల కాన్వాయ్ రాజమండ్రి వైపు సాగింది. చింతలపూడిలో షర్మిల ప్రసంగిస్తుండగా కొందరు వైసీపీ కార్యకర్తలు తమ జెండాలతో గలాటకు ప్రయత్నించారు.

నామినేషన్ల పరిశీలన పూర్తి

- 140 నామినేషన్లకు 30 తిరస్కరణ..
- 110 నామినేషన్లు సక్రమం

ఏలూరు సిటీ, ఏప్రిల్ 26 : ఏలూరు జిల్లాలో ఒక పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 140 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా వీటిలో వివిధ కారణాలతో 30 తిరస్కరణకు గురయ్యాయి. మిగిలిన 110 మంది అభ్యర్థుల నామినేషన్లు సక్రమంగా ఉన్నాయి. ఏలూరు ఎంపీ స్థానానికి మొత్తం 17 మంది నామినేషన్ల దాఖలు చేయగా నాలుగు తిరస్కరించారు. 13 సక్రమంగా ఉన్నాయి. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు 123 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా 26 తిరస్కరణకు గురయ్యాయి. 97 సక్రమంగా ఉన్నాయి.

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా..

ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో 16 మంది నామినేషన్‌లు దాఖలు చేయగా ఒక్కటి తిరస్కరించారు. 15 సక్రమంగా ఉన్నాయి. ఉంగుటూరులో 16 మంది నామినేషన్లు దాఖలు చేయగా ఒకటి తిరస్కరించగా 15 సక్రమంగా ఉన్నాయి. దెందులూరులో మొత్తం 18 నామినేషన్లకు మూడింటిని తిరస్కరించగా 15 సక్రమంగా ఉన్నాయి. పోలవరంలో 23 మంది నామినేషన్ల వేయగా వాటిలో పది తిరస్కరించారు. 13 సక్రమంగా ఉన్నట్లు తేల్చారు. చింతలపూడి నుంచి 12 నామినేషన్లు దాఖలు కాగా మూడు తిరస్కరించగా తొమ్మిదింటిని ఆమోదించారు. నూజివీడులో 15 నామినేషన్లు దాఖలు కాగా మూడింటిని తిరస్కరించారు. 12 నామినేషన్లను ఆమోదించారు. కైకలూరు నుంచి 23 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా ఐదింటిని తిరస్కరించగా 18 మంది నామినేషన్లు సక్రమంగానే ఉన్నట్లు గుర్తించారు.

సారథి నామినేషన్‌పై ఉత్కంఠ

నూజివీడు, ఏప్రిల్ 26 : నూజివీడు టీడీపీ అభ్యర్థి కొలుసు పార్థసారథి నామినేషన్ ఆమోదంపై శుక్రవారం తీవ్ర ఉత్కంఠ నెలకొంది. నామినేషన్ల పరిశీలన సమయంలో అఫిడవిట్‌లో క్లర్కికల్ మిస్టేక్స్ ఉండడంతో వైసీపీ ప్రతినిధులు అభ్యంతరాలను వ్యక్తం చేశారు. ప్రధానంగా సారథిపై ఉన్న కేసుల విషయంలో, ఆయనకు హైదరాబాద్‌లో వున్న సొంత కర్మాగారం యాజమాన్య హక్కులు, పేర్లు, ఐటీ రిటర్న్ అంశాలపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఆర్వో వై.భవానీశంకరి ఆ విషయాలపై వివరణ కోరారు. పార్థసారథి, ఆయన న్యాయవాదులు వివరణ ఇస్తూ క్లర్కికల్ మిస్టేక్స్‌పై హైకోర్టు ఆదేశాలను ఆర్వోకి చూపించడంతో చివరికి నామినేషన్‌ను ఆమోదించారు. దాదాపు ఐదు గంటలపాటు నామినేషన్ ఆమోదంపై కార్యకర్తల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

సొంత గూటికి ముద్దరబోయిన

- ఫలించిన పుట్టా దౌత్యం.. టీడీపీలో జోష్

నూజివీడు, ఏప్రిల్ 26 : టీడీపీ ఎంపీ అభ్యర్థి పుట్టా మహేశ్‌యాదవ్ దౌత్యం ఫలించింది. నూజివీడు టీడీపీ రెబల్‌గా నామినేషన్ వేసిన ముద్దరబోయిన వెంకటేశ్వరరావు వెనక్కు తగ్గారు. ఆదివారం ఆయన తిరిగి టీడీపీలో చేరనున్నట్లు విశ్వసనీయ సమాచారం. పదేళ్ళుగా నూజివీడు టీడీపీ ఇన్‌చార్జ్‌గా వున్న ముద్దరబోయిన స్థానంలో అదే సామాజిక వర్గానికి చెందిన మాజీ మంత్రి కొలుసు పార్థసారథికి టీడీపీ అధిష్ఠానం నూజివీడు టిక్కెట్ కేటాయించింది. దీంతో అలకబూనిన ముద్దరబోయిన టీడీపీకి రాజీనామా చేసి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. నెల రోజుల నుంచి ప్రచారం చేస్తున్నారు. దీనిపై పార్థసారథి ఆయనను బుజ్జగించే ప్రయత్నం చేసినా ఫలించలేదు. ఈ దశలో ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ మాజీ ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు వంటి నాయకులతో మాట్లాడించారు. టీడీపీ అధినేతతో ఫోన్‌లో మాట్లాడించడంతో ఆయన శాంతించారు. నామినేషన్ ఉపసంహరించి తిరిగి పార్టీలో చేరటానికి అంగీకరించారు. ఒక దశలో సీఎం జగన్‌ను కలిసినా, ఆయన వైసీపీ జెండా కప్పుకోవడానికి అంగీకరించలేదు. చివరకు పార్థసారథి, వెంకటేశ్వరరావులు ఒక జెండా నీడకు రావడంతో పార్టీ క్యాడర్ సంబర పడుతోంది.

75 మంది వలంటీర్ల తొలగింపు

కలిదిండి, ఏప్రిల్ 26 : కలిదిండిలోని ఓ ఫంక్షన్ హాలులో ఈ నెల 20న నిర్వహించిన వైసీపీ నేతల సమావేశంలో పాల్గొన్న 75 మంది వలంటీర్లను విధుల నుంచి తొలగించినట్టు ఎంపీడీవో దినతేజ్ తెలిపారు. వీఎస్‌టీ టీమ్ వీడియో ఆధారంగా ఆ సమావేశంలో రాజీనామా చేసిన వారితోపాటు విధుల్లో ఉన్న వలంటీర్లు కూడా ఉన్నట్టు గుర్తించి ఈనెల 23న నోటీసులు జారీ చేసినట్టు చెప్పారు. ఎన్నికల అధికారి నిర్ణయం మేరకు మండలంలో 75 మంది వలంటీర్లను తొలగించినట్టు ఎంపీడీవో తెలిపారు.

1,05,638 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

ఏలూరు సిటీ, ఏప్రిల్ 26: జిల్లాలో ఇప్పటివరకు 1,05,638 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి శుక్రవారం వెల్లడించారు. జిల్లాలో నేటి వరకు 8,143 మంది రైతుల వద్ద నుంచి రూ.207.31 కోట్లు విలువైన 1,05,638 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారన్నారు. కొనుగోలు ప్రక్రియ ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు 15,575 మంది రైతులకు చెందిన 1,26,274 మంది మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నమోదు చేసుకున్నారన్నారు. ఇప్పటివరకు రూ.87.68 కోట్లు జమ చేశామని, మరో రూ.119.63 కోట్లు బ్యాంకులు జమ చేసే ప్రక్రియలో ఉన్నాయన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలులో ఏమైనా ఇబ్బందులు ఉంటే జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు తెలపాలన్నారు. 08812-230448, 77020 03584, 75695 62076, 75695 97910 ఫోన్ నెంబర్లకు రైతులు ఫిర్యాదు చేయవచ్చన్నారు.


విలేకరుల సమావేశంలో రోషన్‌కుమార్, ఘంటా మురళి తదితరులు

ఓటమి భయంతో తప్పుడు ఆరోపణలు

- చింతలపూడి టీడీపీ అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్

చింతలపూడి, ఏప్రిల్ 26 : వైసీపీ నాయకులు ఓటమి భయంతో తప్పుడు ఆరోపణలు చూపించి తనను మానసికంగా దెబ్బ తీయాలనుకున్నారని, తన నామినేషన్ రద్దు చేయించడానికి పిటీషన్‌దారులు వేసిన ఎత్తులు చిత్తు అయ్యాయని టీడీపీ అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ పేర్కొన్నారు. నామినేషన్ల స్క్రూట్నీ అనంతరం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పిటిషన్ దారులు వైసీపీ అభ్యర్థికి బంధువులని, పిటిషన్ దారుడిపై అనేక కేసులు ఉన్నాయన్నారు. వైసీపీ అభ్యర్థి లంచాలు తీసుకున్న ఉద్యోగి అని, ఆయన తీసుకున్న లంచాలకు తన దగ్గర రుజువులు ఉన్నాయన్నారు. తాను పన్ను చెల్లించి సంపాదించుకున్న డబ్బులతోనే రాజకీయాల్లోకి వచ్చానన్నారు. ఓటమి భయంతో మాల,మాదిగల మధ్య చిచ్చుపెడుతున్నారని ఆరోపించారు. చింతలపూడిలో అభివృద్ధి జరిగిందా? ఒక్క రోడ్డు వేశారా? ఒక్క డ్రైయినేజీ నిర్మించారా? ఏ అభివృద్ధి చేయలేదు. మూడు లక్షల జనాభాకు ఐదేళ్లలో ఇచ్చే నిధులు కోటి రూపాయలేనా? దీంతో ఏం అభివృద్ధి చేశారని ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. తాను ప్రజాక్షేత్రంలో పోరాటం చేస్తానని ప్రజల కోసం తాను స్వచ్ఛందంగా సేవలు అందించానని, అన్నింటికి తాను సంసిద్ధమేనన్నారు. కూటమి నాయకులు మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ, జె.ముత్తారెడ్డి, విక్రమ్‌కిషోర్, టి.నాగవిజయ్‌కుమార్, అడ్వకేట్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏసీబీ కేసులో సీఐ, అసిస్టెంట్ రైటర్ అరెస్టు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 26 : ఏలూరు త్రీటౌన్ ఏసీబీ కేసులో ఆ స్టేషన్ ఇన్‌స్పెక్టర్, మరో కానిస్టేబుల్‌ను ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. ఏలూరు ఏసీబీ జిల్లా కార్యాలయంలో డీఎస్పీ సుబ్బరాజు శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఏలూరు సత్రంపాడునకు చెందిన పెందుర్తి విక్టర్‌బాబు రైల్వే ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. అతను పలువురికి ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసగించడంతో ఏలూరు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో రెండు చీటింగ్ కేసులు నమోదు అయ్యాయి. ఈ ఏడాది నమోదైన కేసుపై హైకోర్టు నుంచి ఉత్తర్వులు తెచ్చుకున్నారు. 41ఏ నోటీసును పోలీసులు అతనికి ఇవ్వాలని కోర్టు ఉత్తర్వులు ఉన్నాయి. ఆ నోటీసు ఇవ్వాలంటే రెండు లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చివరకు రూ.50 వేలను గురువారం రాత్రి ఆ స్టేషన్ ఐడీ పార్టీ కానిస్టేబుల్ సీహెచ్ ఇస్సాకు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెండ్‌గా పట్టుకున్నారు. అతని ఫోన్లను స్వాధీనం చేసుకుని ఫోన్ రికార్డింగ్‌లను పరిశీలించి ప్రధాన నిందితుడిగా స్టేషన్ సీఐ వి.వెంకటేశ్వరరావు, రెండవ నిందితుడిగా అసిస్టెంట్ రైటర్ డి.రాజేంద్ర, మూడో నిందితుడిగా సీహెచ్ ఇస్సాకు లపై కేసు నమోదు చేశారు. గురువారం రాత్రి ఇస్సాకును అరెస్టు చేయగా శుక్రవారం సీఐ వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ రైటర్ రాజేంద్రలను అరెస్టు చేశారు.

సీఐ ఇంట్లో ఏసీబీ అధికారుల తనిఖీలు

సీఐ వెంకటేశ్వరరావు ఇంట్లో శుక్రవారం రాత్రి ఏసీబీ డీఎస్పీ వి.సుబ్బరాజు, ఇన్‌స్పెక్టర్ ఎన్.వి.భాస్కరు సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. ఏడున్నర లక్షల రూపాయలు నగదు, పది లక్షల విలువైన బంగారు ఆభరణాలు, నాలుగు ఇంటి స్థలాలకు సంబంధించిన డాక్యుమెంట్లు, 57 తుపాకీ బుల్లెట్లు లభించడంతో ఏసీబీ అధికారులు అవాక్కయ్యారు. వీటిపై సంబంధిత శాఖ అధికారులకు తెలియజేస్తామని ఏసీబీ డీఎస్పీ ఈ.సుబ్బరాజు వెల్లడించారు.

గీత దాటొద్దు.. మూత తీయొద్దు..!



- ఎక్కడికక్కడ మద్యం అమ్మకాలపై కట్టడి
- గతేడాది లక్ష్యాలతో పోల్చి ఏరోజుకారోజు కోటాకే పరిమితం
- కొద్ది గంటల్లోనే మూత పడుతున్న మద్యం దుకాణాలు
- రాత్రి పొద్దుపోయేంత వరకు బారుల వద్ద కిటకిట

ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ మద్యం అమ్మకాలపై కట్టడి మొదలైంది. ఎవరి ఆదేశాల మేరకు చేస్తున్నారో వెల్లడించకుండానే కోటా పూర్తయిందంటూ మద్యం దుకాణాలను నిర్దిష్ట సమయం కంటే కొన్ని గంటలకు ముందే మూస్తున్నారు. ఇంతకుముందు ఎడాపెడా మద్యం అమ్మకాలు సాగేవి. రాత్రి పొద్దుపోయే వరకు దుకాణాలు అన్ని మందుబాబులతో కిటకిటలాడేవి. ఇప్పటికే నాణ్యత లేని మద్యం విక్రయిస్తున్నారన్న ఆరోపణలు ఉండగా గడిచిన మూడు రోజులుగా లిక్కర్ దుకాణాలపై ఎక్సైజ్ అధికారులు నిఘా ఉంచారు.

(ఏలూరు- ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

జిల్లాలో మద్యం అమ్మకాలకు కళ్ళెం పడింది. ఇంతకుముందు ఎడాపెడా సాగిన అమ్మకాలు జోరు తగ్గింది. ఇదేదో జనం చైతన్యవంతం అయ్యారని కాదు. రోజువారీ కోటా ఎప్పుడు పూర్తయితే అక్కడితో మద్యం దుకాణాలు ఆ రోజుకు మూతపడుతున్నాయి. గడిచిన మూడు రోజులుగా ఇదంతా సాగుతోంది. జిల్లా వ్యాప్తంగా దాదాపు 152కి పైగా మద్యం దుకాణాలు మరో 19 వాకింగ్స్ స్టోర్స్, 16 బార్‌లు ఉన్నాయి. రోజూ కోట్లాది విలువైన మద్యం విక్రయాలు సాగుతాయి. లక్షన్నర మందికి పైగా మద్య సేవనంలో తరించిపోతారని అంచనా. ఉదయం 11 నుంచి సాయంత్రం 9 వరకు మద్యం దుకాణాల్లో అమ్మకాలు సాగేవి. ఇప్పటికే గడిచిన ఐదేళ్లల్లో నిర్దేశించిన బ్రాండ్‌లకు బదులు రకరకాల బ్రాండ్‌లు వచ్చి పడ్డాయి. జనానికి ఇష్టమున్నా లేకపోయినా ఈ బ్రాండ్‌లతోనే సరి చూసుకుంటూ వచ్చారు. ఉదాహరణకు మాన్‌హన్‌హౌస్ లాంటి బ్రాండ్‌లపై ఎక్కువగా మద్యం ప్రియులు ఇష్టపడేవారు. ఇప్పుడు ఆ బ్రాండ్‌కు బదులుగా రక రకాల బ్రాండ్‌లు వచ్చిపడ్డాయి. వాక్ ఇన్ స్టోర్‌లలో కూడా దాదాపు ఇదే పరిస్థితి. కొన్ని బ్రాండ్‌లనే అమ్మకాలకు పరిమితం చేశారు. అత్యధిక ఖరీదైన బ్రాండ్‌ల అమ్మకాలకు వీలు కల్పించారు. ఈ బ్రాండ్‌ల కొనుగోలులో అందరూ నగదు చెల్లించాల్సిందే. అక్కడా ఫోన్ పేలు అమలులో ఉంచినా ఆ తర్వాత దానిని కాదు పొమ్మన్నారు. ఒక రకంగా చెప్పాలంటే మద్యం విక్రయాలు ప్రభుత్వ కనుసన్నలోనే సాగింది. సర్కారు పెద్దలు ఈ బ్రాండ్‌లు సిగ్నల్ ఇస్తే ఆ బ్రాండ్‌లే క్షేత్ర స్థాయి వరకు అమ్మకానికి వచ్చేవి. ఈ పరిస్థితిపై మందుబాబులు కక్కలేక మింగలేక సర్కారుపై అసంతృప్తి వ్యక్తం చేసేవారు. రాను రాను మద్యం విక్రయాలు భారీగా పెరిగాయి. జిల్లాలో కోట్ల రూపాయల మద్యం విక్రయాలు రోజువారీ సాగాయి. తాజాగా ఎన్నికల వేళ నాటు పూర్తిగా తాగేందుకు అలవాటు ఉన్న ప్రాంతాల్లో అయితే సరే సరి. మిగితా ప్రాంతాల్లో లిక్కర్ కోసం జనం ఆరాటపడుతున్నారు. ఎన్నికల ప్రచార వేళ అభ్యర్థులు తమ వెంట జేజేలు కొడుతూ వెనుకుండేవారి కోసం కాస్తంత గొంతు తడిపేందుకు అవకాశం ఇస్తున్నా ఇక్కడ మద్యం దుకాణాలు మూసి ఉండడం అందరిలోనూ ఆగ్రహం కలిగిస్తోంది.

షాపులు మూసి ... బారులు తెరచి....

గడిచిన మూడు రోజులుగా మద్యం దుకాణాల పైన విక్రయాలపై ఆంక్షలు అమలులోకి వచ్చాయి. ఎవరి ఈ ఆంక్షలు విధించారని మద్యంబాబులు ప్రశ్నించినా ఎవరూ సమాధానం చెప్పలేకపోతున్నారు. రోజూవారీ కోటా పూర్తి అయితే చాలు ఆ పైన నయా పైస మందు కూడా విక్రయించడానికి వీలు లేదని ఆదేశాలు వచ్చాయని షాపులలో ఉన్నవారు చెబుతున్నట్టు తెలిసింది. గతేడాది ఇదే రోజు ఎంత మొత్తంలో ప్రభుత్వ విధానంలో సరుకు విక్రయించారో అంతే మొత్తంలో మద్యం విక్రయాలు తప్ప అంతకుమించి ఒక్క అడుగు కూడా ముందుకు వేయకుండా ఆంక్షలు విధించినట్టు చెబుతున్నారు. రాత్రి 6,7 అయ్యే సరికి దాదాపు ప్రభుత్వ మద్యం దుకాణాలు అన్ని మూత పడుతున్నాయి. దీనికి కారణం తెలియక మందుబులంతా బార్ల వైపు ఎగబడుతున్నారు. ఇప్పటికే బార్‌లలో బయటి కంటే క్వార్టర్ ఒక్కింటికి రూ.60 అదనం. ఇప్పటికే తడిచి ముద్దయిన ధరతో పాటు బార్‌లలో అదనపు ధర చెల్లించాల్సి వస్తోందని కొందరు పేచికి దిగుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న బార్‌లు అన్నింటి వద్ద రాత్రి పొద్దుపోయేంత వరకు మందుబాబులతో కిక్కిరిసి కనిపిస్తున్నాయి. బార్‌ల యజమానులు తమకు కూడా ఏరోజు ఆరోజు కోటా మేరకే అమ్మకాలు సాగించాలని ఆంక్షలు ఉన్నాయని భారీగా వచ్చిన జనం వల్ల తమకు వచ్చే లాభం ఏమి లేదని వారి వాదన. అయితే ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ అమ్మకాలు కట్టడి వేయడానికి ఆంక్షలు విధించారా.. ఎక్సైజ్ అధికారుల కనుసన్ననలోనే ఇదంతా సాగిందా.. లేక ఎన్నికల అధికారుల ఆంక్షలకు లోబడి ఈ చర్యలు తీసుకుంటున్నారా.. అనేది తేలడం లేదు. పైవారు చెప్పారంటూ ఆంక్షలను అక్షరాలు అమలు చేస్తున్నారంటే మందుబాబులు విలవిల్లాడుతున్నారు. పోలింగ్ ముగిసేంత వరకు ఇదే పరిస్థితి కొనసాగవచ్చని భావిస్తున్నారు. మద్యం విక్రయాలు కట్టడి చేసేందుకే ఎన్నికల కమిషన్ ఆదేశాల్లో భాగంగానే ఇది అమలు అవుతున్నట్టు కొందరు చెబుతున్నారు.

ఐదు రోజులు మంటలే..!

- తూర్పు, దక్షిణ భారతంలో తీవ్ర వడగాలులు
- రాయలసీమ, తెలంగాణలోనూ..
- వచ్చే నెలలో మరింత వేడిగాలులు...
- 45 డిగ్రీలు దాటి నమోదు
- వాతావరణ నిపుణుల హెచ్చరిక
- గతేడాది రికార్డు దాటొచ్చని అంచనా

విశాఖపట్నం, అమరావతి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మునుపెన్నడూ లేనంతగా ఎండ వేడి, తీవ్ర వడగాడ్పులతో దేశంలోని అనేక ప్రాంతాలు ఉడుకుతున్నాయి. రోహిణి కార్తెకు మరో నెల రోజుల సమయం ఉండగానే రోళ్లు బద్ధలయ్యేలా కాస్తున్న ఎండలతో ప్రజలు ఠారెత్తిపోతున్నారు. ఈ ఏడాది వేసవి తీవ్రంగా ఉంటుందని వాతావరణ నిపుణులు, భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అధికారులు ముందే హెచ్చరించారు. కానీ, అంతకు మించి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. నెల రోజుల నుంచి నమోదవుతున్న ఉష్ణోగ్రతలు, ఎండలు, గాడ్పుల తీవ్రతను పరిగణనలోకి తీసుకుని గతేడాదికంటే ప్రస్తుత ఏడాది రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదు కావొచ్చని ఐఎండీ సీనియర్ అధికారి డీఎస్ పాయ్ శుక్రవారం పేర్కొన్నారు. ఇప్పటి వరకు 2023 అత్యంత వేడి సంవత్సరంగా నమోదైందని, అయితే ఈ ఏడాది ఆ రికార్డును అధిగమిస్తుందని అంచనా వేశారు. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, జార్ఖండ్, పశ్చిమబెంగాల్‌లో తీవ్రమైన వడగాడ్పులు వీయడంతో కొద్దిరోజులుగా పగటి ఉష్ణోగ్రతలు 42 నుంచి 44 డిగ్రీలు, అక్కడక్కడా అంతకుమించి నమోదు కావడం ఆందోళన కలిగిస్తోందన్నారు. కాగా, రానున్న ఐదు రోజుల్లో దక్షిణాదిలో ఏపీ, తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక, వీటికి ఆనుకుని ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, విదర్భ, మహారాష్ట్ర ఉత్తరప్రదేశ్‌లలోని అనేక ప్రాంతాల్లో వేడి వాతావరణం కొనసాగడమే కాకుండా వడగాడ్పులు వీస్తాయని ఐఎండీ శుక్రవారం హెచ్చరించింది. ఈనెల 28 నుంచి 30 వరకు ఈశాన్య భారతంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఒడిశాలో తొమ్మిది జిల్లాలకు వడగాడ్పుల హెచ్చరికలను ఆ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ జారీచేసింది. రానున్న రెండు రోజులు ఉష్ణోగ్రత 46 డిగ్రీలకు చేరనుంది. శనివారం.. ఏలూరు జిల్లాలో తీవ్ర వడగాడ్పులు వీస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ఉష్ణోగ్రతలు, వడగాడ్పులు పెరిగిన నేపథ్యంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్ సూచించారు.

సరదాగా వెళ్లి మృత్యుఒడికి..

- ముగ్గురిని మింగేసిన జల్లేరు వాగు
- రెండు కుటుంబాల్లో తీరని విషాదం

ఏలూరు క్రైం/బుట్టాయిగూడెం, ఏప్రిల్ 26 : జల్లేరు వాగులోకి చేపల వేట చూసేందుకు సరదాగా వెళ్లిన ముగ్గురు మృత్యువాత పడ్డారు. రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చిన ఈ ఘటన జంగారెడ్డిగూడెం మండలం వేగవరం సమీపంలోని జల్లేరు బ్రిడ్జి వద్ద జరి గింది. సాధారణంగా ఇక్కడ వలలు వేసి చేపలు పట్టుకుంటూ ఉంటారు. జీలుగుమిల్లి మండలం దిబ్బగూడానికి చెందిన మౌలాలి అక్కడ చేపలు పట్టడానికి శుక్రవారం బయలుదేరగా అతని భార్య షేక్ మొహిషా(23) తాము వస్తామని, ఆమె సోదరుడు అషాద్(14), బంధువులైన అశ్వారావుపేట మండలం ఊట్లపల్లికి చెందిన షేక్ ఖాజా హుస్సేన్, అతని కుమార్తె రేష్మా(24)లను తీసుకుని బయలుదేరారు. వీరంతా శుక్రవారం మధ్యాహ్నం నుంచి జల్లేరు వాగు వద్దే ఉన్నారు. మౌలాలి, ఖాజా హుస్సేన్ చేపలు పట్టడానికి దూరంగా వెళ్లగా మోషద్, రేష్మా, అషాద్ వాగులోకి దిగారు. ప్రమాదవశాత్తు గుండంలో పడిపోయారు. ఇది చూసిన వారు కేకలు వేసినప్పటికీ ఫలితం లేకపోయింది. దూరాన వున్న మౌలాలి హుస్సేన్‌లకు చెప్పడంతో వారు వచ్చి గాలింపు చర్యలు చేపట్టారు. సమాచారం అందుకు న్న జంగారెడ్డిగూడెం ఎస్ఐ జ్యోతిబస్ ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహకారంతో మృతదేహాలను సాయంత్రానికి బయటకు తీశారు. కేసు నమోదు చేసి మృతదేహా లను జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విగత జీవులుగా మారిన భార్యను, బావమరిది మృతదేహాలను చూసిన మౌలాలి తల్లడిల్లిపోయాడు. సరదాగా వెంట వచ్చి మృతి చెందారంటూ రోదించాడు. ఖాజా హుస్సేన్ కుమార్తె మృతదేహం పట్టుకుని 'నాన్న నేనూ వస్తానంటూ వచ్చి.. నన్ను విడిచి వెళ్లిపోయావా'.. అంటూ కన్నీటి పర్యంతమయ్యాడు. 2022లో ఆర్టీసీ బస్సు ఇదే వాగు బ్రిడ్జిపై నుంచి నీటిలో పడి పది మంది ప్రయాణికులు మరణించారు. ఆ ప్రాంత ప్రజలు ఆ ఘటన మరువక ముందే మరో ముగ్గురు మృత్యువాత పడ్డారు.


మృత దేహాల వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఉంగుటూరు నియోజకవర్గంలో సీఎం హామీలకు దిక్కులేదు. ప్రతిపక్ష హోదాలో జగన్ పాదయాత్ర నియోజకవర్గంలో హామీల టూర్‌గా సాగింది తప్ప ఉంగుటూరు ఏమాత్రం ప్రయోజనం చేకూర్చలేదు. నియోజకవర్గం భిన్నమైన భౌగోళిక స్వరూపం. మెట్టప్రాంతానికి ముఖద్వారంగా భీమడోలు ఒక వైపు.. డెల్టా ప్రాంతానికి ఆరంభం నారాయణపురం మరోవైపు. గణపవరం, నిడమర్రు మండలాలు డెల్టా, కొల్లేటి తీరానికి చేరువలో ఉంటాయి. ఈ నియోజకవర్గంలో ఏ పార్టీ గెలుపు సాధిస్తే ఆ పార్టీ లేదా కూటమి అధికార పీఠం ఎక్కుతుందనే సెంటిమెంట్ కూడా ఉంది. వైసీపీ పాలనలో ఏ ఒక్క హామీ నెరవేరకపోవడంతో నియోజకవర్గం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. ఆక్వా రంగ అభివృద్ధికి ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా మరింత బారం మోపారు. గ్రామాలకు తాగునీటి సమస్య పరిష్కరించలేదు. రహదారుల అభివృద్ధి, వంతెన నిర్మాణ హామీలు అమలు చేయలేదు.

జగన్నాయ


అక్రమ తవ్వకాలతో గుల్ల అయిన పోలవరం కుడికాల్వ గట్టు

హామీల ఉంగుటూరు

- ఆక్వా ప్రోసెసింగ్ పరిశ్రమల ఆచూకీ లేదు
- తాగునీటి స్టోరేజ్ హామీ ఏమైంది
- శిథిల వంతెనల నిర్మాణం ఏదీ
- జగనన్న కాలనీలకు దారే లేదు
- ఇందిరమ్మ కాలనీల్లో సౌకర్యాలు లేవు

ఆక్వా పరిశ్రమలు ఎక్కడ జగనన్నా



ప్రతిపక్ష నాయకుడి హోదాలో జగన్ 2018 మే 23న పాదయాత్ర చేస్తూ ఉంగుటూరు నియోజకవర్గం గణపవరంలో మాట్లాడుతూ ఆక్వా పరిశ్రమ బలోపేతం కోసం కోస్తా కారిడార్ వెంబడి ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. తమ ప్రాంతానికి ఆయువుపట్టు అయిన ఆక్వా పరిశ్రమ అభివృద్ధితో బతుకులు బాగుపడతాయని నమ్మారు. ఐదేళ్లలో ఒక్కటంటే ఒక్క ప్రాసెసింగ్ పరిశ్రమ కూడా ఏర్పాటు చేయలేదు.

నిడమర్రు

వైసీపీ పాలన ఆక్వా రైతులకు గడ్డుకాలం. ప్రభుత్వ విధానాలతో రొయ్య, చేపల ధరలు కనిష్ఠ స్థాయి చేరాయి. రైతుకు కనీస పెట్టుబడి రాక చెరువులు ఖాళీ చేయాల్సి వచ్చింది. రాజకీయ నాయకులు, ప్రభుత్వ పెద్దలు రొయ్య పిల్ల హేచరీల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేశారని రైతులు చెబుతున్నారు. ఆక్వా మేతల కంపెనీల నుంచి కూడా వసూళ్లతో మేత ధరలు పెంచేశారు. రైతులు నష్టాలు మూటగట్టుకుని ఆక్వా సాగుకు దూరమయ్యారు. మరోవైపు వరి రైతులు ధాన్యం అమ్ముకోడానికి నానా తిప్పలు పడుతున్నారు. అమ్మిన వెంటనే సొమ్ము అందక అప్పుల పాలవుతున్నారు. వ్యాపారాలు సన్నగిల్లాయి. ఉన్న పరిశ్రమలు మూతపడడంతో గ్రామాల్లో ఉపాధి లేక జనం అల్లాడుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రతి నెలా జీతం ఇవ్వండి మొర్రో అని గగ్గోలు పెడుతున్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనుల ఊసే లేదు. అధ్వాన రహదారులు, కాల్వలపై శిథిల వంతెనల నిర్మాణం గాలికొదిలేశారు. కాలనీల అభివృద్ధి పట్టించుకోలేదు. జగనన్న కాలనీల్లో రహదారులు లేవు.

నెరవేరని హామీలు..

2022 మే 16న గణపవరంలో సీఎం జగన్ పర్యటనలో ఎమ్మెల్యే పుప్పాల శ్రీనివాసరావు ప్రస్తావించిన సమస్యలపై పరిష్కారానికి బహిరంగ ప్రకటన చేశారే గానీ ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు.

- కొల్లేరు లంక గ్రామాల ప్రజల తాగునీటి సమస్య పరిష్కారానికి స్టోరేజి చెరువు నిర్మిస్తామన్నారు. నిధులు మంజూరు చేసినా అటవీ శాఖ అనుమతులు లేక ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.
- శిథిలదశకు చేరిన నారాయణపురం, ఉంగుటూరు, పూళ్ళ, గుండుగొలను, కేశవరం వంతెనల పునర్నిర్మాణానికి హామీ ఇచ్చారు. గుండుగొలను వంతెనకు శంకుస్థాపన చేశారు. పనుల్లేవు.
- విద్యుత్ డిమాండ్ తగ్గట్టుగా ఆరు సబ్ స్టేషన్‌ల నిర్మాణానికి హామీ ఇచ్చారు. రెండు పూర్తయ్యాయి. మరోటి సగంలో ఉండగా మిగతా మూడు పత్తా లేకుండా పోయాయి.
- పేదలకోసం గత ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన ఇళ్ల స్థలాల్లో రహదారులు, డ్రెయినేజీ నిర్మాణ హామీలు అది అమలు కాలేదు. ఇందిరమ్మ కాలనీలలో తాగునీరు, డ్రైనేజి సౌకర్యం లేవు.
- గణపవరంలో వెంకయ్య వయ్యేరుపై శిథిలావస్థకు చేరిన బొబ్బిలి వంతెన పున్నిర్మాణ హామీ అమలుకు నోచుకోలేదు.
- మండలంలో వ్యవసాయ, ఆక్వా చెరువలకు వెళ్లే రహదారులన్నీ ఛిద్రం కావడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. పుంత రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు కార్యాచరణకు నోచుకోలేదు.
- గణపవరంలో తీరని సమస్య అగ్నిమాపక కేంద్రం నిర్మాణం చేస్తానని ఎమ్మెల్యే పుప్పాల శ్రీనివాసరావు ఇచ్చిన హామీ నేటికి నెరవేరలేదు.
- పత్తేపురం - తోకలపల్లి రహదారి అధ్వానం. అడవికొలను - నిడమర్రు రహదారి నిర్మాణంపై ఐదేళ్లుగా ఉలుకు పలుకు లేదు.
- పెదనింద్రకొలను పీహెచ్‌సీ భవన నిర్మాణం చేపట్టకుండానే 5 ఏళ్ల గడిపోయాయి. అసెంబ్లీ తొలి సమావేశంలోనే ఎమ్మెల్యే వాసుబాబు ఈ విషయం ప్రస్తావించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు.
- నిడమర్రులో 8 గ్రామాలకు తాగునీరు అందించేందుకు చేపట్టిన సమగ్ర మంచినీటి పథకం ఇంకా అసమగ్రంగా మిగిలింది.
- ఉంగుటూరు వ్యవసాయ మార్కెట్ యార్డుకు సొంత భవనం లేదు. భూమి సేకరించి భవన నిర్మాణానికి ఏడు సార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. మార్కెట్ యార్డు నిధులతో పుంత రోడ్లు నిర్మాణానికి రూపాయి కూడా ఖర్చు చేయలేదు.
- నారాయణపురం వంతెన 90 ఏళ్లక్రితం బ్రిటిష్ హయాంలో నిర్మితమైంది. శిథిల వంతెన నిర్మాణానికి రూ.8.50 కోట్ల అంచనాతో టెండర్ పిలిచిన కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు.
- భీమడోలు మండలంలో లంక గ్రామాలకు తాగునీటి సమస్య నేటి పరిష్కారం కాలేదు
- వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లే పుంతరోడ్ల పరిస్థితి, అంతర్గత రహదారుల పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది.
- గుండుగొలను వంతెన పనులు నత్తనడక సాగుతున్నాయి. పాతూరు, పూళ్ళ బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రతిపాదనలు దశలో మిగిలిపోయాయి. భీమడోలు రైల్వే ఓవర్‌బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం చొరవ చూపలేదు.
- ఇందిరమ్మ కాలనీ, జగన్న కాలనీలలో మౌలిక వసతులు లేవు. అప్పులుచేసి ఇళ్లు నిర్మించుకొంటే కనీసం తాగునీరు కూడా ప్రభుత్వం అందించలేకపోతోంది.


కూలడానికి సిద్ధంగా ఉన్న నారాయణపురం వంతెన


కనీస వసతులు లేని క్రొవ్విడి జగనన్న కాలనీ

విజయానికి ఆయువు పట్టు



కైకలూరు అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల విజయంలో కీలకం కలిదిండి మండల. నియోజకవర్గంలో కైకలూరు, మండవల్లి, ముదినేపల్లి మండలాలు ఉన్నాయి. ఇప్పటి వరకు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కలిదిండి మండలంలో మెజార్టీ సాధించిన అభ్యర్థులు మాత్రమే గెలుపొందారు. 1978 నుంచి 2019 వరకు 10 సార్లు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కలిదిండి మండలంలో వచ్చిన మెజార్టీతోనే విజయం సాధించారు. 1978లో ఇండిపెండెంట్ అభ్యర్థి కనుమూరి బాపిరాజు కలిదిండి మండలంలో వచ్చి 48 ఓట్లు మెజార్టీతో సమీప కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సుధాబత్తుల నాగేశ్వరరావుపై గెలుపొందారు. 1983లో టీడీపీ అభ్యర్థి కమ్మిలి విఠల్ రావుపై కాంగ్రెస్ అభ్యర్థి కనుమూరి బాపిరాజు 850 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూడ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దూలం నాగేశ్వరరావు టీడీపీ అభ్యర్థి జయమంగళ వెంకటరమణపై సుమారు 9100 ఓట్ల మెజార్టీ రాగా, లంక గ్రామాల్లో సుమారు 7500 మెజార్టీ వచ్చింది. ఈ గణాంకాలను బట్టి ఇప్పటివరకు కలిదిండి మండలంలో లంక గ్రామాలదే హవా నడుస్తోంది. లంక గ్రామాల్లో చైతన్యవంతమైన ఓటర్లు అభివృద్ధి పనులు చేసిన వారికే పట్టం కట్టడం ప్రధాన కారణమని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. లంక గ్రామాలైన గుర్వాయిపాలెం, అమరావతి, సంతోషపురం, భాస్కరావుపేట, మూల్లంక, పెదలంక, మట్టగుంట, కొండంగి గ్రామ పంచాయతీల్లో సుమారు 23 వేల ఓటర్లు ఉన్నారు. వారంతా ఏ పార్టీ వైపు మొగ్గు చూపుతారో వారు గెలుపొందే అవకాశం ఉండడంతో నియోజకవర్గంలో అందరి చూపు లంక గ్రామాలపైనే ఉంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం చేస్తూ లంక గ్రామాలపై గురి పెట్టారు. - కలిదిండి

ఎన్నికల దండలు

జోరందుకున్న పూల వ్యాపారం

ఐదేళ్ల ఎన్నికల పండుగ చిరు వ్యాపారులకు ఊతమిచ్చింది. నామినేషన్ ఘట్టంలో పూల వ్యాపారం జోరందుకుంది. ఇప్పటి వరకు నామినేషన్లు దాఖలు చేయడానికి ర్యాలీగా తరలివెళుతున్న నేతలకు పూల దండలు వేయడానికి అభిమానులు, కార్యకర్తలు ఎగబడ్డారు. ముందుగానే పూల దండలకు ఆర్డర్లు ఇచ్చి సిద్ధం చేసుకుంటున్నారు. నామినేషన్ల ర్యాలీలు ముగియడంతో ప్రచారానికి వెళుతున్న అభ్యర్థులకు గ్రామాల్లో పలువురు పూల దండలు వేసి అభిమానం చాటుకుంటున్నారు. ఇక జిల్లా స్థాయి నాయకులు వచ్చినా, పార్టీ అధినేతలు వచ్చినా కార్యకర్తలు పూలదండలు, గజమాలలు వేసి కేరింతలు కొడుతున్నారు. నామినేషన్ల ఘట్టం ముగియడంతో అభ్యర్థులు పలువురు పుష్పగుచ్చాలు ఇచ్చి అభినందిస్తున్నారు. నగరం, పట్టణాలు, గ్రామాల్లో సైతం పూలకు ఒక్కసారిగా డిమాండ్ వచ్చింది. పువ్వులు సిద్ధం చేసి అమ్మకానికి ఎదురుచూసే పరిస్థితి లేకుండా వ్యాపారులకు ముందుగానే ఆర్డరు ఇచ్చి మరీ దండలు, పువ్వులు తెప్పించుకుంటున్నారు. ఎన్నికలు ముగిసేవరకు పూల వ్యాపారం జోరుగా సాగుతుందని వ్యాపారులు సంబర పడుతున్నారు. అమ్మకాలు పెరగడంతో స్వల్ప లాభానికే విక్రయిస్తున్నామని పలువురు చెబుతున్నారు. ఎన్నికలు ముగిసిన తర్వాత విజయం సాధించిన వారి విజయోత్సవ ర్యాలీ వరకు తమకు వ్యాపారం బాగానే సాగుతుందని పూల వ్యాపారులు ఉత్సాహంగా ఉన్నారు.


ఏలూరు కల్చరల్, గణపవరం







మా ఓటు వేయం..!



తాడేపల్లిగూడెం పట్టణంలో తాళ్లముదునూరుపాడు వాసులు ఓట్లు అడగవద్దని స్పష్టం చేశారు. తమ సమస్యలు పరిష్కరించకుండా ఓటు అడిగితే వేసేది లేదని తెగేసి చెప్పారు. తాళ్లముదునూరుపాడులో బ్యానర్ కూడా ఏర్పాటుచేశారు. తమ ప్రాంతంలో మంచినీరు అందడంలేదని, డ్రైయినేజి వ్యవస్థ బాగోలేదని నాయకులకు, అధికారులకు ఐదేళ్లుగా ఎన్ని సార్లు వినతిపత్రం అందించినా పట్టించుకోలేదన్నారు. తాము ఎన్నికల్లో ఓట్లు వేయబోమని స్పష్టం చేశారు. తమ సమస్య పరిష్కరించిన తర్వాతే ఓట్లు అడగాలని నాయకులకు విజ్ఞప్తి చేశారు. - తాడేపల్లిగూడెం రూరల్

నిను వీడని నీడను నేను..

అభ్యర్థుల ఖర్చుపై నిఘా



సార్వత్రిక ఎన్నికలకు నామినేషన్ల ఘట్టం దాదాపు పూర్తయినట్లే. ఏ పార్టీ తరపున ఏ అభ్యర్థి పోటీలో ఉంటారనేది కూడా తేలింది. నామినేషన్లకు సుమారు నెల రోజుల ముందు నుంచే అభ్యర్థులు విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేపట్టారు. నియోజకవర్గాల్లో ఆత్మీయ సమావేశాలు, గ్రామాల్లో నాయకులతో కలసి ప్రచారాలు ఒక రౌండ్ పూర్తి చేశారు. ఇక రెండో రౌండ్ సాదాసీదా ప్రచారం చేస్తే చాలదు. పోలింగ్ రోజు వరకు భారీ ఖర్చు తప్పదు. ఎన్నికల సంఘం అధికారులు అభ్యర్థులను నీడలా వెంటాడతారు. అభ్యర్థులు ఎన్నికల సంఘం మార్గదర్శక సూత్రాల మేరకు ఖర్చు చేస్తున్నారా, నియమావళి ఉల్లంఘిస్తున్నారా పరిశీలించేందుకు పలు బృందాలు పరిశీలిస్తాయి. ఒక్క మాటలో చెప్పాలంటే గెలుపుకోసం అభ్యర్థులు ఎన్ని కోట్ల ఖర్చుకైనా వెనుకాడరన్నది స్పష్టమవుతున్నది.

ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, ఎస్ఎస్‌టి బృందాలు, కోడ్ ఆఫ్ కండక్ట్ బృందం వీడియో వీక్షక బృందం, అకౌంటింగ్ బృందం, వీడియో సర్వేలియన్స్ బృందాలు పోటీలో ఉన్న అభ్యర్థుల కదలికలను గమనిస్తుంటాయి. ప్రచారం తీరు, ఖర్చును అంచనా వేయడంతోపాటు అభ్యర్థులు ఎన్నికల నియమావళిని పాటిస్తున్నారా లేదా? సభలు, సమావేశాలు, ర్యాలీలు జరుగుతున్న తీరు, సంబంధిత బృందాల అధికారులు నిఘా వేస్తారు. వాహనాల తనిఖీలు నిర్వహించి పరిమితికి మించి డబ్బు, మద్యం, ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే విలువైన వస్తువులను రవాణా చేస్తుంటే స్వాధీనం చేసుకుంటారు. నీడలా వెంటాడే ఈ బృందాల మధ్య అభ్యర్థులు పోలింగ్ ముగిసే వరకు నిబంధనల ఛత్రంలో గడపాల్సిందే. - ముదినేపల్లి

పోస్టల్ బ్యాలెట్ ఎవరికి..



ఎన్నికల విధుల్లో ఉండే సిబ్బందికి పోలింగ్ రోజు ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉండదు. వారికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించారు. ఎన్నికల విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు పోలింగ్ కంటే ముందు ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకుంటారు. ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాలి.

పోస్టల్ బ్యాలెట్‌కు ఎవరు అర్హులు

ఎన్నికల విధుల్లో ఉంటే అధికారులు, సిబ్బంది, పోలీసులు, పాత్రికేయులు పోస్టల్ బ్యాలెట్‌కు అర్హులు. ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ ఆఫీసర్స్, ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వెలెన్స్ టీమ్, అకౌంటింగ్, సెక్టోరల్ అధికారులు, బీఎల్‌వోలు, పోలీస్, అత్యవసర సేవల సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ పొందేందుకు అర్హులు. ఆయా విభాగాల హెడ్‌ల ద్వారా ఫారమ్ 12 దరఖాస్తులు ఇస్తారు. దీనిని పూర్తి చేసి సంబంధిత ఏఆర్‌వోకు పంపించాలి. ఇలా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఉద్యోగికి ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పిస్తారు. ఒక ప్రాంతంలో ఓటు ఉండి, వేరే ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న వారికి సొంత ఊరులో ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉంది. పోస్టల్ బ్యాలెట్ కోసం ఉద్యోగులకు ప్రత్యేకంగా ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తారు. అక్కడ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలి.

ఫెసిలిటేషన్ సెంటర్..

గతంలో ఎన్నికల విధుల్లో ఉంటే అధికారులు సిబ్బందికి బ్యాలెట్ పేపర్‌ను ఇంటికి పంపేవారు. అక్కడ ఓటు పూర్తిచేసి కవరల్లో పెట్టి సంబంధిత అధికారికి ఇచ్చేవారు. కొన్ని చోట్ల ఇవి దుర్వినియోగం అవుతుండడంతో కొత్త నిబంధన 18ఏ తెచ్చారు. దీని ప్రకారం ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్‌లోనే వారికి బ్యాలెట్ ఇస్తారు. దీనిని ఇంటికి తీసుకువెళ్లేందుకు అనుమతించరు. ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్‌లో నచ్చిన అభ్యర్థికి ఓటు వేయాలి, తరువాత బ్యాలెట్ పేపర్‌ను, ప్రమాణ పత్రాన్ని జత చేసి కవరులో పెట్టి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పెట్టెలో వేయాలి. పోస్టల్ బ్యాలెట్ వినియోగం ఏ తేదీన ఏ విభాగం అధికారులు ఓటు వేయాలో ఉన్నతాధికారులు తెలియజేస్తారు. ఆ సమయంలో వెళ్ళి ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉంది. ఈ పోస్టల్ బ్యాలెట్‌ను ఈవీఎంలతో పాటు లెక్కిస్తారు.

ఈ పత్రాలు జతచేయాలి

- పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు (ఫారం -12)
- ఎన్నికల డ్యూటీ సర్టిఫికెట్, లేదా భద్రతా దళాల ఐడెంటీ కార్డు జిరాక్స్
- ఆధార్ కార్డు జిరాక్స్
- ఓటర్ గుర్తింపు కార్డు జిరాక్స్

- అత్తిలి / నిడమర్రు

అప్పుడు 21 ఏళ్లకు ఓటు

ఇప్పుడు 18 ఏళ్లకే..



కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల నిర్వహణలో ఏడు దశాబ్దాల కాలంలో అనేక సంస్కరణలను తీసుకువచ్చింది. భారతదేశంలో మొదటి సాధారణ ఎన్నికలు 1952లో ఎన్నికల కమిషనర్ సుకుమార్ జయన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలి భారతదేశ ఎన్నికల్లో 17.90కోట్ల ఓటర్లకు ఓటు వేసే అవకాశం కల్పించారు. స్వాతంత్ర్య వచ్చినప్పటి నుంచి 1955 వరకు ఓటు హక్కు కనీస వయస్సు 21 సంవత్సరాలు. రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రి అయ్యాక 1988లో 61వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా ఓటు హక్కు వయస్సును 18 ఏళ్లకు తగ్గించారు.

ఎన్నికల నిర్వహణలో సమూల సంస్కరణలు అమలు చేసిన ఘనత 1990లో ఎన్నికల కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన టీఎన్ శేషన్‌కు దక్కుతుంది. 1952లో జరిగిన భారతదేశ మొదటి సాధారణ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా 55 పార్టీలు బరిలో నిలవగా 2014 నాటికి ఆ సంఖ్య 370కి చేరింది. ఎన్నికల నిర్వహణలో కేంద్ర ఎన్నికల సంఘం 7దశాబ్దాల్లో అనేక సంస్కరణలు చేపట్టింది. బ్యాలెట్ పేపర్లతో ఎన్నికల నిర్వహించే పద్ధతి నుండి ప్రస్తుతం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం) ఉపయోగించే విధానాన్ని అమలు చేస్తున్నారు. 2019లో జరిగిన ఎన్నికల నుండి ఓటు ఎవరికి వేస్తారో తెలుసుకునేందుకు ఓటరు వెరిఫై పేపర్ ఆడిట్ ట్రయల్ (వీవీఎం ప్యాట్) యంత్రాలను కూడా వినియోగిస్తున్నారు.

- కైకలూరు


ఉప ఎన్నికల్లో గెలిస్తే.. అంతే !



నరసాపురం నియోజక వర్గంలో ఉప ఎన్నికల్లో పోటీ చేసి గెలిచిన వారికి మళ్లీ రాజకీయ భవిష్యత్ కనిపించడం లేదు.. ఇప్పటి వరకు ముగ్గురు అభ్యర్థులు ఉప ఎన్నికల్లో పోటీ చేశారు. ఆ తరువాత ఎన్నికల్లో పోటీ చేసినా విజయం సాధించలేదు. ఈ సెంటిమెంట్ రాజకీయ పార్టీల్లో బలంగా పాతుకు పోయింది. తొలిసారి ఉప ఎన్నిక 1981లో జరిగింది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పరకాల కాళికాంబ పోటీ చేసి విజయం సాధించారు. తరువాత 83 ఎన్నికల్లో ఆమె పోటీ చేసినా విజయం సాధించలేదు. తరువాత పదేళ్లపాటు రాజకీయాల్లో ఉన్నా తిరిగి పోటీ చేయలేదు. ఇటీవల ఆమె కాలం చేశారు. ఇక 1996 మాజీ ఎమ్మెల్యే కొత్తపల్లి జానకీరామ్ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలు పొందారు. తరువాత ఆయనకు మళ్లీ పోటీ చేసే ఛాన్స్ రాలేదు. ఇక 2012లో మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు పోటీ చేసి గెలుపొందారు. 2014లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. ఆ తరువాత 2019, 2024లో ఆయనకు టిక్కెట్ దొరక లేదు. ఉప ఎన్నికల్లో పోటీ చేసి గెలిచిన తర్వాత రాజకీయ భవిష్యత్తు ఉండదని చాలామంది చర్చించుకుంటూ ఉంటారు.

- నరసాపురం


పల్లెల్లో.. అంతా సైలెంట్



ఎన్నికలు దగ్గర పడుతున్నాయి.. గ్రామాల్లో నిశ్శబ్ద వాతావరణమే కనిపిస్తున్నది. ఒక పక్క పోటీలో ఉన్న ఇరు అభ్యర్థులు ప్రచారంలో జోరు కనబరుస్తుంటే పల్లె ఓటర్లు వారి పనులలోనే నిమగ్నమై ఉన్నారు. దీంతో గ్రామాలలోకి ప్రధాన కూడళ్లలో హడావుడి ఎక్కడా కనిపించడం లేదు. ఎన్నికల పిచ్చాపాటి మాటలు వినిపించడం లేదు. నా పార్టీ గొప్పది.. మా అభ్యర్థి ఇది చేశాడు.. అది చేశాడు అనే పోటాపోటీ మాటలు గతంలోలాగా వినిపించడం లేదు. అసలు ఎన్నికల వేళనా.. అనే సందేహం కలుగుతోంది. దీంతో ఏ పార్టీకి ఎంత ఓటర్ల బలం ఉంటుందనే అంచనా అంతుచిక్కడం లేదు. ఎక్కడా రాజకీయ వేడి కనిపించడం లేదు. అభ్యర్థి ప్రచారానికి వచ్చిన సమయంలో పార్టీ కార్యకర్తలే రోడ్డెక్కుతున్నారు. ఏ పార్టీవైపు మాటల్లో కూడా మద్దతు తెలపడం లేదు. ఈ విధానం చూస్తుంటే గప్‌చిప్‌గా ఓటు వేశామా.. వచ్చేశామా.. మన పని మనం చూసుకున్నామా అనే తీరు గ్రామాల్లో కనిపిస్తున్నది. ఈ లెక్కన చూస్తే ఓటర్లు ఏ పార్టీకి మక్కువ అనేది అంచనా వేయడం కాస్త కష్టమే.!

- భీమవరం రూరల్

హలో...అక్కడ ఎవరు గెలుస్తారు ?



హలో..మన దగ్గర ఎన్నికలు ఎలా జరుగుతున్నాయి ? ఈసారి ఎవరు గెలుస్తారు? జిల్లాలో ఎన్ని సీట్లు వస్తాయంటూ దేశ, విదేశాలు, పక్క జిల్లాలో ఉన్న బంధువులు, స్నేహితులు ఫోన్ల ద్వారా సమాచారాన్ని తెలుసుకుంటున్నారు. రోజులో ఏదో ఒక సమయంలో ఫోన్ చేసి సమాచారం అడుగుతున్నారు. ఎక్కువగా తెలంగాణ, అమెరికా నుంచి ఇలా ఫోన్లు వస్తున్నాయి. ప్రస్తుతం హైద్రాబాద్‌లో ఉద్యోగాలు చేస్తూ, ఆక్కడ స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న వారు జిల్లా రాజకీయాలపై ఆసక్తి చూపుతున్నారు. వీరితో పాటు ఉద్యోగం, చదువుల నిమిత్తం అమెరికా వెళ్లినవారు కూడా గెలుపు, ఓటములపై ఆరా తీస్తున్నారు. ఇటు జిల్లావాసులు కూడా పక్క జిల్లాలు, రాష్ట్రంలో ఇతర ప్రాంతాల్లో ఉన్న బంధువులు, స్నేహితులకు ఫోన్ చేసి ఆక్కడ రాజకీయ పరిస్థితుల్ని ఆడిగి తెలుసుకుంటున్నారు. ఎన్నికల మొదలైన దగ్గర నుంచి ఫోన్లలో రాజకీయాలపై ఆసక్తికరంగా చర్చించుకోవడం గమనార్హం.

-నరసాపురం

కూల్..గా ప్రచారం



ఎన్నికల పోలింగ్ సమయానికి కౌంట్‌డౌన్ మొదలైంది. దీంతో గెలుపుకోసం బరిలో నిలిచిన అభ్యర్థులు పోటా పోటీగా ప్రచారం చేస్తున్నారు. వారం రోజుల నుంచి ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. భానుడి ప్రతా పానికి పార్టీ నాయకులు, కేడర్ అల్లాడిపోతున్నారు. ఈ నేపథ్యంలో అభ్యర్థులు ప్రచార స్టైల్ మార్చారు. గతంలో మాదిరిగా ఉదయం 9 నుంచి కాకుండా 7 గంటల నుంచే ఇంటింటి ప్రచారం మొదలు పెట్టేస్తున్నారు. 11 గంటలకే ముగించి మళ్లీ సాయంత్రం 4 నుంచి రాత్రి 9 వరకు కొనసాగిస్తున్నారు. బహిరంగ సభలు కూడా సాయంత్రం సమయంలోనే పెట్టుకుంటున్నారు. ఇక ప్రచారంలో ఖాళీ సమయం దొరికిందంటే పార్టీ కార్యాలయాల్లో సమావేశాలు, భవిష్యత్ వ్యూహాలపై చర్చిస్తున్నారు. అదే సమయంలో కొందరు పార్టీల్లో స్తబ్దుగా ఉంటున్న వారిని కలిసి వారిని తమ వైపు తిప్పుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు ఎండవేడికి బయపడి ప్రచారాలు ఎప్పుడు ముగుస్తాయా అని కేడర్ రోజులు లెక్క బెట్టుకున్నాయి. మొదటి విడతలోనే ఎన్నికలు జరిగి ఉంటే ఈ తిప్పలు తప్పేవని నాయకులు భావిస్తున్నారు.

-నరసాపురం

మూడుసార్లు ప్రత్యర్థులు వారే...



ఎన్నికలు వచ్చాయంటే ప్రతీ విషయం ప్రత్యేకమే. అటువంటి విశేషం భీమవరం నియోజకవర్గంలో చోటుచేసుకుంది. ప్రస్తుత ఎన్నికల్లో ఉమ్మడి కూటమి అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు), ప్రస్తుత ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పోటీ చేస్తున్నారు. వీరు గతంలో రెండు ఎన్నికల్లోను ప్రత్యర్థులుగా ఎన్నికల బరిలో దిగారు. 2014లో అంజిబాబు నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చెయ్యగా ప్రత్యర్థిగా గ్రంధి శ్రీనివాస్ పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో అంజిబాబు విజయం సాధించారు. తరువాత 2019లో జరిగిన ఎన్నికల్లో తిరిగి అంజిబాబు టీడీపీ తరపున, వైసీపీ నుంచి గ్రంధి శ్రీనివాస్ పోటీ చెయ్యగా శ్రీనివాస్ విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో కూడా జనసేన తరపున అంజిబాబు, ప్రత్యర్థిగా శ్రీనివాస్ పోటీలో ఉన్నారు. మరి ఈసారి ఎవరు విజయం సాధిస్తారో అని ఆసక్తిగా చూస్తున్నారు.

-భీమవరం టౌన్

రాష్ట్రంలో ప్రధాన వాణిజ్య కేంద్రంగా తాడేపల్లిగూడెం విరాజిల్లుతోంది. జిల్లా సంత మార్కెట్‌తో ప్రారంభమైన తాడేపల్లిగూడెం ఇప్పుడు జాతీయ దృష్టిని ఆకర్షించింది. విద్యారంగంలోనూ వికసించింది. రాష్ట్ర రాజకీయాల్లోనూ తాడేపల్లిగూడెం తనదైన ముద్ర వేసుకుంది. పూర్వం పశ్చిమ గోదావరి జిల్లాలో నడిబొడ్డున ఉన్న తాడేపల్లిగూడెం విద్య, వ్యాపార వాణిజ్య రంగాలలో రాణిస్తున్నది.

- తాడేపల్లిగూడెం రూరల్




వాణిజ్య రాజధాని

ఫ్లాష్ బ్యాక్

తాడేపల్లిగూడెంలో విలక్షణ తీర్పు..
మూడు సార్లు దేవుడి మంత్రి పదవి
విద్యారంగంలో విశేష ప్రగతి
వ్యాపార, వాణిజ్య కేంద్రంగా పేరు

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నడిబొడ్డున నిలిచే తాడేపల్లిగూడెం జిల్లా పునర్విభజన తరువాత పశ్చిమ గోదావరి జిల్లాలో నిలిచింది. అక్కడ గతంలో ఏలూరు పార్లమెంట్ పరిధిలో తాడేపల్లిగూడెం నియోజకవర్గం ఉండేది. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 2009లో నర్సాపురం పార్లమెంట్ పరిధిలో తాడేపల్లిగూడెం విలీనమైంది. ప్రస్తుతం జిల్లా పునర్విభజనతో ఏలూరు, తూర్పుగోదారి జిల్లాల సరిహద్దు ప్రాంతంగా తాడేపల్లిగూడెం గుర్తింపు పొందింది.



నియోజకవర్గం : తాడేపల్లిగూడెం
మొత్తం ఓటర్లు : 2,13,229
పురుషులు : 1,04,059
మహిళలు : 1,09,160



ఓటర్ల విలక్షణ తీర్పు

తాడేపల్లిగూడెం నియోజకవర్గ ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో ఎప్పుడూ విలక్షణ తీర్పును ఇస్తూ వచ్చారు. 1952 నుంచి ఇప్పటివరకూ 18 సార్లు ఎన్నికలు జరిగాయి. ఐదు సార్లు టీడీపీ జెండా రెపరెపలాడింది. మరో ఐదుసార్లు కాంగ్రెస్ విజయడంకా మోగించింది.మూడు సార్లు కాంగ్రెస్‌ఐ విజయదుంధుభి మోగించాయి. జిల్లాలో ప్రజారాజ్యం తరపున పాలకొల్లులో పోటీ చేసిన పార్టీ అధినేత చిరంజీవి ఓటమి పాలయ్యారు. తాడేపల్లి గూడెం ప్రజలు మాత్రం ప్రజారాజ్యానికే ఇక్కడ పట్టం కట్టారు. ఇండిపెండెంట్ అభ్యర్థిని గెలిపించిన చరిత్ర తాడేపల్లిగూడెంది. బీజేపీ, వైఎస్ఆర్ పార్టీలు కూడా ఇక్కడ పాగా వేశాయి. తాడేపల్లిగూడెం చరిత్రలో ఈలి ఆంజ నేయులు (టీడీపీ), మైలవరపు రాజ భాస్కరరావు (కాంగ్రెస్‌ఐ)పై అత్యధిక మెజారిటీ 42,694 ఓట్లతో గెలవగా ఈలి వరలక్ష్మి (కాంగ్రెస్-ఐ) పసల కనకసుందరం (టీడీపీ)పై 31 ఓట్ల అత్యల్ప మెజార్టీ సాధించారు.

మూడు సార్లు దేవుడు మంత్రులు...

తాడేపల్లిగూడెం నియోజకవర్గానికి మంత్రి పదవులు లభించిన చరిత్రలు ఉన్నాయి. రాష్ట్ర కేబినేట్‌లో ముగ్గురు శాసన సభ్యులకు చోటు లభించింది. వారంతా దేవదాయ శాఖకే ప్రాతినిధ్యం వహించడం విశేషం. తెలుగుదేశం ఆవిర్భావంలో ఈలి ఆంజనేయులు ఆ పార్టీ తరపున తాడేపల్లిగూడెంలో గెలుపొందారు. ఆయన దేవదాయ శాఖ మంత్రిగా పనిచేవారు. అలాగే 2014లో బీజేపీ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందిన పైడి కొండల మాణిక్యాలరావును దేవదాయ శాఖ మంత్రి పదవి వరించింది. తాజాగా కొట్టు సత్యనారాయణ సైతం దేవదాయ శాఖ మంత్రిగా పనిచేస్తున్నారు. ఇలా ముగ్గురు మంత్రులు దేవదాయ శాఖకే ప్రాతినిధ్యం వహించడం విశేషం



సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ	మెజార్టీ
1952	సీహెచ్‌వీపీ మూర్తిరాజు	కాంగ్రెస్	కేవీ కృష్ణారావు	కేఎంపీపీ	485
1955	ఎన్.శ్రీనివాసరావు	కాంగ్రెస్	కేఎస్ రెడ్డి	సీపీఐ	11,407
1962	అల్లూరి కృష్ణారావు	కాంగ్రెస్	జి.రంగనాయకులు	స్వతంత్ర	2,146
1967	అల్లూరి కృష్ణారావు	కాంగ్రెస్	ఈలి ఆంజనేయులు	స్వతంత్ర	3,600
1972	ఈలి ఆంజనేయులు	స్వతంత్ర	కె.కోసూరి	కాంగ్రెస్	4,200
1978	సీహెచ్‌వీపీ మూర్తిరాజు	కాంగ్రెస్	ఈలి ఆంజనేయులు	కాంగ్రెస్	7,673
1983	ఈలి ఆంజనేయులు	టీడీపీ	మైలవరపు రాజభాస్కరరావు	కాంగ్రెస్	42,694
1983	(ఉపఎన్నిక) ఈలి వరలక్ష్మి	టీడీపీ	మైలవరపు రాజభాస్కరరావు	కాంగ్రెస్	30,128
1985	యర్రా నారాయణస్వామి	టీడీపీ	ఈలి వరలక్ష్మి	స్వతంత్ర	20,875
1987	(ఉపఎన్నిక)ఈలి వరలక్ష్మి	కాంగ్రెస్	పసల కనకసుందరరావు	టీడీపీ	31
1989	పసల కనకసుందరరావు	టీడీపీ	ఈలి వరలక్ష్మి	కాంగ్రెస్	1,596
1994	పసల కనకసుందరరావు	టీడీపీ	కొట్టు సత్యనారాయణ	కాంగ్రెస్	7,033
1999	యర్రా నారాయణస్వామి	టీడీపీ	కొట్టు సత్యనారాయణ	కాంగ్రెస్	10,491
2004	కొట్టు సత్యనారాయణ	కాంగ్రెస్	పసల కనకసుందరరావు	టీడీపీ	24,993
2009	ఈలి మధుసూధనరావు	ప్రజారాజ్యం	కొట్టు సత్యనారాయణ	కాంగ్రెస్	3,020
2014	మాణిక్యాలరావు	బీజేపీ	సత్యనారాయణ	వైసీపీ	14,073
2019	కొట్టు సత్యనారాయణ	వైసీపీ	ఈలి మధుసూధనరావు	టీడీపీ	16,466

తెలుగుదేశం పార్టీకి కంచుకోట

తాడేపల్లిగూడెం తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా నిలిచింది. పార్టీ ఆవిర్భావం తరువాత అత్యధిక సార్లు తాడేపల్లిగూడెంలో తెలుగుదేశం ప్రాతినిధ్యం వహించింది. పసల కనకసుందర్రావు, ఈలి ఆంజనేయులు, యర్రా నారాయణస్వామిలు తెలుగుదేశం పార్టీ నుంచి విజయం సాధించారు. 2004 మాత్రమే కాంగ్రెస్ గెలుపొందింది. ఆ తరువాత 2009లో ప్రజారాజ్యానికి పట్టం కట్టారు. 2014లో పొత్తులో భాగంగా తాడేపల్లిగూడెం సీటును బీజేపీకి కేటాయించారు. అప్పటిలో తెలుగుదేశం శ్రేణులంతా బీజేపీని నెగ్గించారు. ఆ తరువాత వైసీపీ చేజిక్కించుకుంది.ప్రస్తుతం తెలుగుదేశం కూటమి ఏర్పడింది. పొత్తులో తాడేపల్లిగూడెం సీటును జనసేనకు కేటాయించారు.

వ్యాపార రాజధాని..

తాడేపల్లిగూడెం పేరు వినగానే ముందుగా గుర్తొచ్చేది వ్యాపార కూడలి. రాష్ట్రం నలుమూలలకు తాడేపల్లిగూడెం నుంచే ఉల్లి, మిర్చి తదితర వాణిజ్య వ్యాపారాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇక్కడి నుంచే ఒరిస్సా, పశ్చిమ బెంగాల్, అస్సాం, బిహార్ రాష్ట్రాలకు ఉల్లి ఎగుమతి జరుగుతుంది. హోల్‌సేల్ పండ్ల వ్యాపారానికి తాడేపల్లిగూడెం ప్రసిద్ధి.. ఇక్కడి నుంచే ఇతర జిల్లాలకు పండ్లు ఎగుమతి జరుగుతుంటాయి. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో సైనికులకు అందించాల్సిన ఆహార పదార్థాలు తాడేపల్లిగూడెం నుంచే రవాణా చేశారు. దానికోసమే తాడేపల్లిగూడెంలో విమానాశ్రయ రన్‌వే ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పండ్లు, కూరగాయలకు జిల్లాతో పాటు రాష్ట్రంలో ఇతర ప్రాంతాలకు ఇక్కడ నుంచే ఎగుమతులు అవుతుంటాయి. ముఖ్యంగా ఉల్లి, ఎండు మిర్చి వాణిజ్యం అత్యధికంగా సాగుతుంది.

విద్యా రంగంలో ముందుకు..

విద్యారంగంలో తాడేపల్లిగూడెం జాతీయస్థాయి గుర్తింపు పొందింది. గత తెలుగుదేశం హయాంలో తాడేపల్లిగూడెంలో ఆంధ్రప్రదేశ్ నేషనల్ ఇనిస్టిట్యూట్ టెక్నాలజీ (ఏపీ నిట్) ఏర్పాటు చేశారు. దీంతో విద్యారంగంలో తాడేపల్లిగూడెం ఖ్యాతి జాతీయమైంది. రాష్ట్రం నలుమూలల నుంచి ఇంజనీరింగ్ విద్యార్థులు నిట్‌లో చదువుకుంటున్నారు. దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా తాడేపల్లి గూడెంలో ఉద్యాన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచే ఉద్యాన రంగంలో అనేక పరిశోధనలకు బీజం పడింది. నన్నయ్య విశ్వవిద్యాలయ క్యాంపస్‌లతో పాటు మరిన్ని ప్రైవేటు విద్యా సంస్థలు ఉండటంతో తాడేపల్లిగూడెం విద్యాపరంగా ముందుకు దూసుకు పోతోంది.

మిలటరీలో మాధవరం ప్రత్యేకత

తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో మిలటరీ మాధవరానికి ప్రత్యేకత ఉంది. రెండో ప్రపంచ యుద్ధంలో మాధవరం గ్రామం నుంచి ఇంటికి ఒకరుచొప్పున యుద్ధానికి బయలు దేరి వెళ్లారు. అప్పట్లోనే మాధవరం ఏమిటో ప్రపంచానికి తెలిసింది. నాటి నుంచి నేటి వరుకూ మాధవరంలో యువత సైన్యంలో చేరేందుకే మక్కువ చూపిస్తుంటారు. ఇప్పటికి మాధవరంలో ఇంటికి ఒకరు దేశ రక్షణ రంగంలో పనిచేస్తున్నారు. జాతీయ నేతలు సైతం మాధవరాన్ని సందర్శించారు. రక్షణ శాఖ మాధవరం అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించింది.



చింతలపూడిలో అభిమానులతో కరచాలనం



యాత్రలో వైఎస్, హస్తం గుర్తు బుట్టబొమ్మల సందడి

ఎన్నికల ప్రచారంలో భాగంగా పీసీసీ అధ్యక్షురాలు షర్మిల శుక్రవారం జిల్లాలోని చింతలపూడి, గోపన్నపాలెంలో పర్యటించారు.. అక్కడ జరిగిన సభల్లో మాట్లాడారు. పార్టీ కార్యకర్తలతో పాటు, సీపీఐ, సీపీఎం సభ్యులు పాల్గొన్నారు.



చింతలపూడిలో వైసీపీ జెండాలతో కవ్వింపు చర్యలు



చింతలపూడిలో ఎర్రజెండా రెపరెపలు

ఐదేళ్లుగా రవాణా అవస్థలు

రేపు పిఠాపురంలో పవన్‌ను కలవనున్న లారీ ఓనర్లు



పాలకొల్లు, ఏప్రిల్ 26 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గోదావరి క్వారీ లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు ఆదివారం పిఠాపురంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను కలవనున్నారు. ఐదేళ్లుగా లారీ ఓనర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పవన్ దృష్టికి తీసుకు రానున్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు రావూరి రాజా తెలిపారు. ఆర్థిక బాధలు తాళలేక లారీ ఓనర్ల గుండెలు ఆగుతున్నాయని, రెండు రోజుల క్రితం నవాబుపాలెం గ్రామంలో ఒకలారీ ఓనర్ ఆర్థిక బాధలతో గుండెపోటుతో మృతిచెందారని రాజా ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ ఐదేళ్లలో రవాణా రంగానికి గడ్డుకాలం వచ్చిందన్నారు సమస్యల పరిష్కారానికి కూటమి మేనిఫెస్టోలో చేర్చాలని పవన్‌ను కోరనున్నట్టు రాజా తెలిపారు. లారీ ఓనర్లు అందరూ కూటమి వెంటే ఉండి కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామన్నారు. డీజిల్‌పై వ్యాట్,రోడ్డు సెస్ తగ్గించాలని, భారీగా పెంచిన గ్రీన్ ట్యాక్స్ తగ్గించాలని, ఓవర్ లోడ్‌పై పెనాల్టీలను తగ్గించాలని, క్వార్టర్లీ టాక్స్‌ను కూడా తగ్గించాలని, కూటమి ప్రభుత్వంలో ఉచిత ఇసుక విధానంలో టిప్పర్ లారీలకు మేలు చేయాలని, ఇంకా పలు డిమాండ్లను మేనిఫెస్టోలో చేర్చాలని పవన్‌ను కోరనున్నట్టు రాజా తెలిపారు.

ఎన్నికల తనిఖీలు

నగదు,మద్యం స్వాధీనం

ఏలూరు క్రైం, ఏప్రిల్ 26 :ఎన్నికల నేపథ్యంలో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. అన్ని ప్రధాన ప్రాంతాల్లోనూ జాతీయ, రాష్ట్రీయ రహదారులపై తనిఖీలు నిర్వ హించారు. నాటుసారా, నగదు, మద్యం, గంజాయి రవాణా జరుగకుండా పటి ష్టమైన చర్యలు చేపట్టినట్టు ఎస్పీ ప్రశాంతి తెలిపారు.శుక్రవారం జిల్లాలోని చింత లపూడి, భీమడోలు, జంగారెడ్డిగూడెం, నూజివీడు, పోలవరం, ఏలూరు, కైకలూరు ఎస్ఈబీ పోలీస్ స్టేషన్ అధికారులు, చెక్‌పోస్టుల వద్ద సిబ్బందితో దాడులు నిర్వహించారు. నాటుసారా తయారీ, విక్రయ దారులపై దాడుల చేసి 80 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. 3,800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి మూడు కేసులు నమోదు చేశారు. డ్యూటీ పెయిడ్ లిక్కర్ కల్గి ఉన్నవారిపై 11 కేసులు నమోదు చేసి 64.24 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఏడుగురిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు తెలిపారు.



దాడుల్లో పాల్గొన్న అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు, సిబ్బంది..స్వాధీనం చేసుకున్న సారా తయారీ సామాగ్రి



కొత్తూరు ఎన్నికల చెక్‌పోస్టులో నగదు స్వాధీనం చేసుకున్న అధికారులు,పోలీసులు

కామవరపుకోట/ఉంగుటూరు ఏప్రిల్ 26 : కొత్తూరు చెక్‌పోస్టు వద్ద అధికారులు వాహన తనిఖీలు చేపట్టగా వ్యాన్‌లో తీసుకువెళుతున్న వ్యక్తి నుంచి లక్షా 30 వేలు స్వాధీనం చేసుకున్నట్లు చెక్‌పోస్టు ఎన్నికల అధికారి ఎండి మొహిద్దీన్ తెలిపారు. గుంటూరు నుంచి జంగారెడ్డిగూడెం వ్యాన్‌పై వెళుతున్న వ్యక్తి నుంచి ఈనగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాహనతనిఖీలలో పోలీసులు కె.రమేష్, పి.రాంబాబు, కె.రామకృష్ణసూర్యారావు,రాము తదితరులు ఉన్నారు. ఉంగుటూరు టోల్ ప్లాజావద్ద శుక్రవారం కారును తనిఖీ చేయగా అందులో అనుమతిలేని నగదు రూ.70,500 లను స్వాధీనం చేసుకున్నట్టు రిటర్నింగు అధికారి ఖాజావలి తెలిపారు. పెనుగొండ నుంచి ఏలూరు వెళుతున్న కారును తనిఖీ చేయగా మదిచెర్ల అప్పా రావు, నౌదు దుర్గారావుల నుంచి అనుమతిలేని నగదు రూ.70,500 స్వాధీనం చేసుకున్నారు.



ఏలూరు ప్రజాసంకల్ప యాత్రలో బడేటి చంటికి హారతిస్తున్న మహిళలు

ఆరోగ్యవంతమైన సమాజ స్థాపన కోసమే

కూటమి ఏర్పాటు : బడేటి చంటి

ఏలూరుటూటౌన్, ఏప్రిల్ 26: వైసీపీ విష రాజకీయ పరిస్థితుల నుంచి రాష్ట్రాన్ని బయటకు తీసుకొచ్చి ఆరోగ్యవంతమైన సమాజం నెలకొల్పడం కోసమే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఏర్పడిందని ఏలూరు కూటమి అభ్యర్థి బడేటి రాధాకృష్ణయ్య(చంటి) అన్నారు. శుక్రవారం ఏలూరు 18వ డివిజన్‌లో ప్రజాసంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల వద్దకే పాలన తీసుకొచ్చిన పార్టీ తెలుగుదేశమని అన్నారు. ఫ్యాక్షనిజం పాలన నుంచి ప్రజలకు విముక్తి కలిగించేందుకు ప్రజాచైతన్యం అవసరమన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో తీసుకెళ్ళి ప్రజలు ఏ విధంగా నష్టపోయారో వివరిస్తున్నామన్నారు. వైసీపీ ప్రభుత్వం ప్రజలను నమ్మించి మోసం చేసిందని ఆ ప్రభుత్వాన్ని ప్రజలు చీదరించుకుంటున్నారన్నారు. రాష్ట్రానికి పట్టిన చీడను వదిలించేందుకు ఓటు అనే ఆయుధాన్ని ఉపయోగించుకోవాలన్నారు. రాష్ట్రాభివృద్ధి మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లతోనే సాధ్యమన్నారు. ప్రజలంతా ఏకమై జగన్ ప్రభుత్వాన్ని కూలదోయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి రెడ్డి అప్పలనాయుడు, యుడా మాజీ చైర్మన్ ఈశ్వరిబలరామ్, గాది రాంబాబు, నాగం శివ, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానికి ఓటర్లు మద్దతివ్వాలి

» ఉంగుటూరు కూటమి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు



గొల్లగూడెంలో వృద్ధురాలితో మాట్లాడుతున్న జనసేన అభ్యర్థి పత్సమట్ల. గన్ని

ఉంగుటూరు,ఏప్రిల్ 26 : కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు ఓటర్లు మద్దతివ్వాలని, గ్రామాల్లో టీడీపీ హయాంలో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో సీసీ రహదారులు వేశామని జనసేన ఉంగుటూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం గొల్లగూడెం గ్రామంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనే యులు, బీజేపీ నాయకురాలు శరణాల మాలతీరాణి, కూటమి కార్యకర్తలు, అభిమానులతో కలిసి ఆయన ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి మహిళలు, వృద్ధుల యోగ క్షేమాలను అడిగి తెలుసుకుని సూపర్ సిక్స్ పథకాలను వివరించి ఓట్లను అభ్యర్థించారు. తనతో పాటు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్‌కు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కరపా వెంకటశ్రీనివాసరావు, ఎంపీటీసీ గద్దే మంగేష్, స్థానిక నాయకులు మాజీ ఎంపీపీ నెక్కలపూడి వీరవెంకట సత్యనారాయణ, వేములపల్లి సుధీర్, దాసరి రాజశేఖర్, కడియాల రవిశంకర్, ఇమ్మణ్ణి గంగాధరరావు, చింతల శ్రీనివాస్, నేకూరి ఆశీర్వాదం, పాతూరి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. చేబ్రోలు, గోపీనాథపట్నం చర్చిల్లో ప్రార్థనలు చేసి పాస్టర్ల ఆశీర్వాదం తీసుకున్నారు. చేబ్రోలు సర్పంచ్ రాంధే లక్ష్మీసునీత, మాజీ సర్పంచ్ రాంధే రాజారావు, గోపీనాథపట్నం టీడీపీ అధ్యక్షుడు బీరా పెద్దిరాజు, ఉంగుటూరు సర్పంచ్ బండారు సింధు తదితరులు పాల్గొన్నారు. కైకరం గ్రామంలోని పలు వార్డులలో సర్పంచి సలగాల గోపి, చింతల శ్రీనివాస్, యెగ్గిన పెదబాబు తదితరులు ప్రచారం చేశారు.

చలివేంద్రాలు ఓ పుణ్య కార్యక్రమమే : డీఎంహెచ్‌వో

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 26 : పాదచారుల దాహార్తిని తీర్చే చలివేంద్రాల ఏర్పాటు ఓ పుణ్యకార్యక్రమమేనని డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట అన్నారు. ఏపీ ఎన్జీవోల సంఘం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో నగరంలోని ముఖ్యకూడళ్ళలో చలివేంద్రాలు, మజ్జిగ పంపిణీకేంద్రాలను శుక్రవారం ఆమె ప్రారంభించారు. పాతబస్టాండ్, ఆటోస్టాండ్ చలివేంద్రాలవద్ద ఆమె మాట్లాడుతూ ప్రయాణికులకు రద్దీ కూడళ్ళలో మజ్జిగ ప్యాకెట్లను పంపిణీచేయడం ఖర్చుతో కూడుకున్నప్పటికీ సేవాభావంతో చేపట్టిన ఇటువంటి స్వచ్ఛందకార్యక్రమం స్ఫూర్తి దాయకమన్నారు. ఎన్జీవోల సంఘంలో అంతర్భాగమైన వైద్యఉద్యోగుల విభాగం సౌజన్యంతో రోజుకి వెయ్యిమందికి మజ్జిగ ప్యాకెట్లు, మరికొన్ని శాఖల ఉద్యోగులు చలివేంద్రాలను నిర్వహించడానికి నిర్ణయించారని ఉద్యోగుల జేఏసి ఉమ్మడిజిల్లా చైర్మన్ సీహెచ్.శ్రీనివాస్ వివరించారు. ఎన్జీవోల సంఘం ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఎన్.రామారావు, ఏలూరు తాలూకా కార్యదర్శి కె.సత్యనారాయణ, ట్రెజరర్ పి.శ్రీనివాస్, మహిళావిభాగం చైర్‌పర్సన్ కె.నాగమణి, సునీత, టి.కుసుమకుమారి, సభ్యులు పాల్గొన్నారు.

డీఎల్‌ఎడ్ సెమిస్టర్ పరీక్షకు 112మంది హాజరు

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 26 : డీఎల్‌ఎడ్ పరీక్షల్లో భాగంగా శుక్రవారం జరిగిన మూడో సెమిస్టర్ పరీక్షకు జిల్లాలో 63 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 60 మంది, మొదటి సెమిస్టర్ పరీక్షకు 54మందికి 52మంది హాజరయ్యారని డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు.

ఆధ్యాత్మికం



రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి, ఏప్రిల్ 26 : రాట్నాలకుంట రాట్నాలమ్మ వారి తిరునాళ్ళ మహోత్సవాలు నాలుగోరోజు శుక్రవారం ఉదయం విఘ్నేశ్వరపూజ, నవగ్రహ మండపారాధన, పరివార దేవతార్చన, కుంకుమా ర్చన పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటలకు కోలాటం, రాత్రి ఎనిమిది గంటలకు నిర్వహించిన అమ్మవారి తెప్పోత్సవం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం ఏర్పాటు చేసిన బాణాసంచా కాల్పులు భక్తుల కళ్ళను కట్టిపడేశాయి.

కనకదుర్గాదేవి అలంకరణలో రాట్నాలమ్మ

రాట్నాలకుంట రాట్నాలమ్మవారి తిరునాళ్ళు నాలుగోరోజు శుక్రవారం కనకదుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఒక చేతిలో ఖడ్గం, మరో చేతిలో త్రిశూలం, శంఖచక్రాలతో రాట్నాలమ్మవారు దర్శనమిచ్చారు. ఆఖరిరోజు శనివారం ఉదయం విఘ్నేశ్వరపూజ, కుంకుమార్చన ఉంటాయి. ఉదయం శాంతి కల్యాణం, అనంతరం భారీ అన్నసమారాధన ఉంటుంది. రాత్రి 8గంటలకు కోలాటం, 9గంటలకు పూల రంగడు సాంఘిక పద్మనాటకం ఉంటాయని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు. శనివారం శ్రీరాట్నాలమ్మవారు రాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిస్తారు.

ఘనంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

కొయ్యలగూడెం, ఏప్రిల్ 26: వెలంపేట గ్రామంలో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గత మూడు రోజులు ప్రత్యేక హోమాలు నిర్వహించారు. శుక్రవారం ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి పలు గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

భక్తాంజనేయ స్వామి ఆలయ శిఖర ప్రతిష్ఠ

ఉంగుటూరు, ఏప్రిల్ 26 : మండలంలోని ముక్కోటి ఉత్సవాలకు సుప్రసిద్ధమైన భక్తాంజనేయ స్వామికి శుక్రవారం ఆలయ ప్రాంగణంలో పలు రకాల పూజలు నిర్వహించి ఆలయ గోపురానికి శిఖర ప్రతిష్ఠ జరిపారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ గోపురానికి శిఖర ప్రతిష్ఠ జరిపారు.

అంబికాదేవి సన్నిధిలో కుంకుమార్చనలు

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 26 : చైత్రమాసం మూడో శుక్రవారం కావడంతో సత్రంపాడులోని అంబికాదేవి ఆలయ ప్రాంగణంలో అర్చకులు భక్తులతో రాహుకాల శ్రీలలితా సహస్ర నామస్తోత్ర ఖడ్గమాల పూర్వక శ్రీచక్ర కుంకుమార్చనలను జరిపించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకుని భక్తి సంకీర్తనలు ఆలపించి భజనలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కూటమి ప్రభుత్వంతోనే గ్రామీణాభివృద్ధి

» ఉంగుటూరు కూటమి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు





తాడువాయిలో టీడీపీలోకి ఆహ్వానిస్తున్న సొంగా.. రామశింగవరంలో కూలీలతో మాట్లాడుతున్న చింతమనేని

గణపవరం/భీమడోలు, ఏప్రిల్ 26: కూటమి ప్రభుత్వంతోనే గ్రామీణాభి వృద్ధి సాధ్యమని, గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో వైసీపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఉంగుటూరు కూటమి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శుక్రవారం గణపవరం మండలం కేశవరం గ్రామంలో జనంలోకి ధర్మరాజు కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు, దండు రామచంద్రరాజు, చింతల పాటి బాబు తదితరులు పాల్గొన్నారు. భీమడోలు మండలం పూళ్ల గ్రామంలో అఖిల భారత రాష్ట్ర పెన్షనర్ల సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి పూర్ణచం ద్రరావు ఆధ్వర్యంలో 'చంద్రబాబు గెలుపు పెన్షనర్ల పిలుపు' కరపత్రాన్ని ధర్మరాజు, ప్రభుత్వ ఉద్యోగులు ఆవిష్కరించారు.

పేద వర్గాల సంక్షేమమే టీడీపీ ఆశయం

పెదవేగి : పేద వర్గాల సంక్షేమమే టీడీపీ ఆశయమని దెందులూరు కూటమి అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ అన్నారు. మండలంలోని రామశింగవరం, న్యాయంపల్లి, గార్లమడుగు, లక్ష్మీపురం, పెదవేగి, కూచిం పూడి గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రామశింగవరంలో ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సాధక బాధలను అడిగి తెలుసుకున్నారు.

● దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ జగదీష్‌ను లంక గ్రామాల టీడీపీ నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ డాక్టర్ జగదీష్ తిరుపతిలోని ఆర్థోపెడిక్ ఆస్పత్రితోపాటు ద్వారకాతిరుమలలోని విర్డ్ ఆస్పత్రిలో ఎంతోమందికి వైద్యసేవలు అందించారన్నారు..

తెలుగుదేశం పార్టీలోకి భారీ చేరికలు

బుట్టాయిగూడెం : ఐదేళ్లల్లో రాష్ట్రం సర్వనాశనం అయ్యింది. చంద్రబాబు విజన్ కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. అందుకే టీడీపీపై ప్రజాదరణ పెరిగిందని చింతలపూడి నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ అన్నారు. జంగారెడ్డిగూడెం మండలం తాడువాయిలో ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్‌తో కలసి శుక్రవారం ప్రచారం నిర్వహించారు. గ్రామంలో కాంగ్రెసు, వైసీపీకి చెందిన 50 మంది నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. టీడీపీ నాయకులు దాసరి శ్యామ్ చంద్ర శేషు, పెనుమర్తి రామ్‌కుమార్, మండవ లక్షణరావు, తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



పూళ్ళలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

భీమడోలు, ఏప్రిల్ 26 : వేసవి కాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వడదెబ్బకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు సూచించారు. పూళ్ళ ప్రాథమిక వైద్య కేంద్రంలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఉపాధిహామీ కూలీలు ప్రజలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వేసవిలో ఎక్కు వగా ద్రవ పదార్థాలు, కొబ్బరి బొండాలు, మజ్జి తీసుకోవాలని, తలకు టోపీ తగిలిం చాలని, కళ్ళద్దాలు పెట్టుకోవాలన్నారు. ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

29న ప్రపంచ నృత్య దినోత్సవం

ఏలూరు కల్చరల్, ఏప్రిల్ 26: వైఎంహెచ్ఏ ఆధ్వర్యంలో ఈనెల 29న సాయంత్రం 4 గంటలకు వైఎంహెచ్ఏ ప్రాంగణంలో వందమందికి పైగా నాట్యకళాకారులచే ప్రపంచ నృత్య దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు వైఎంహెచ్ఏ ప్రతినిధులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఒకే వేదికపై నాట్యాచారులు శిష్యబృందం నాట్యప్రదర్శనలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అనంతరం నాట్య గురువులను సత్కరిస్తామని తెలిపారు. కళాభిమానులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

ఎనిమిది అడుగుల తాచుపాము హల్‌చల్



కోళ్ల ఫారం వద్ద పట్టుకున్న తాచుపాము

బుట్టాయిగూడెం, ఏప్రిల్ 26 : జంగారెడ్డిగూడెం మండలం వేగవరం గ్రామంలో భారీ తాచుపామును స్నేక్ సేవియర్ సొసైటీ ప్రతినిధి సురక్షి తంగా పట్టుకున్నారు. వేగవరంలోని ఒక కోళ్ల ఫారంలో ఎనిమిది అడుగులు పొడవు, ఏడు కేజీలు బరువు గల నల్ల తాచుపాము ప్రవేశించి కోడి పిల్లలపై దాడి చేస్తున్న క్రమంలో పాముని గుర్తించిన శ్రీనివాస్ అనే రైతు ఒక్కసారిగా భయభ్రాం తులకు గురయ్యాడు. వెంటనే జంగా రెడ్డిగూడెం స్నేక్ సేవియర్ సొసైటీ సంస్థకు సమాచారం అందించడంతో సంస్థ అధ్యక్షుడు చదలవాడ క్రాంతి వెళ్లి పామును సురక్షితంగా పట్టుకుని అడవి ప్రాంతంలో విడిచి పెట్టారు.

క్రైం వార్తలు

కూలీ అనుమానాస్పద మృతి



జగన్మోహనరావు (ఫైల్)

పెదపాడు, ఏప్రిల్ 26 : జయపురం గ్రామానికి చెందిన బలే జగన్మోహనరావు(32) అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన శుక్రవారం జరిగింది. పెదపాడు పోలీసులు తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన జగన్మోహనరావుకు రెండేళ్ల క్రితం వివాహం కాగా భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కూలి పనులతో పాటుగా క్యాటరింగ్ వృత్తి చేస్తున్న జగన్మోహనరావు అదే గ్రామానికి చెందిన బలే గోవిందరాజు చెరువు వద్ద అనుమానాస్పద స్థితిలో విద్యుత్తు షాక్‌కు గురై మృతి చెందినట్టుగా పడి ఉండడంతో స్థానికులు పెదపాడు పోలీసులకు సమాచారమందించారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలాన్ని పెదవేగి సీఐ కె.శ్రీనివాసకుమార్ పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా పెదపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. విద్యుత్తుషాక్‌కు గురైన ఆనవాళ్లు ఏమీ లేవని విద్యుత్తు శాఖ అధికారులు చెబుతుండగా, పోలీసుల పూర్తిస్థాయి దర్యాప్తుతో మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

యువకుడి అనుమానాస్పద మృతి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 26 : మతిస్థిమితంలేని ఓ యువకుడు తమ్మిలేరు వాగులో అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఏలూరు కొత్తూరు సమీపంలోని సాయినగర్‌కు చెందిన పైడిరాజు(26) మానసిక దివ్యాంగుడు అతడికి ఫిట్స్ కూడా ఉంది. ఈనెల 24నుంచి అతడు కనిపించడం లేదు. కొత్తూరు బ్రిడ్జి సమీపంలో తమ్మిలేరువాగులో అనుమానాస్పదంగా మృతి చెంది ఉన్నాడు. బహిర్భూమికి వెళ్లిన సమయంలో ఫిట్స్ రావడంతో మృతి చెందాడని భావిస్తున్నారు. శుక్రవారం ఉదయం కాల్వలో మృతదేహం ఉన్నట్టు ఏలూరు రూరల్ పోలీసులకు సమాచారం అందడంతో ఏలూరురూరల్ ఎస్ఐ కె.రాజారెడ్డి సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్యపై కత్తితో దాడి.. భర్తపై కేసు నమోదు

జీలుగుమిల్లి, ఏప్రిల్ 26 :రాచన్నగూడెం పంచాయతీ శివారు తాటిరాముడుగూడెంలో గురువారం రాత్రి భర్త పూసం చెంచులు భార్యపై కత్తితో దాడి చేసిన ఘటన జరిగింది. భార్యాభర్తల మధ్య గొడవ రావడంతో భార్య మెడపై భర్త కత్తితో నరికాడు. అనంతరం రక్తపు మడుగులో ఉన్న భార్యను వదిలి పరారయ్యాడు. గ్రామస్థులు భార్య ముత్తమ్మను వైద్యం నిమిత్తం జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి తరలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై భర్త చెంచులును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపారు. మెడపై భాగం వద్ద 14 కుట్లు పడిన బాధితురాలు ఆస్పత్రిలో వైద్యం పొందుతుంది. తాగిన మైకంలో ఈ ఘటన జరిగినట్టు స్థానికులు చెబుతున్నారు.

వరి, మొక్కజొన్న పంటల దగ్ధం

పోలవరం, ఏప్రిల్ 26: మండలంలోని ప్రగడవల్లి పంచాయతీ వింజరం, వెంకటరెడ్డిగూడెం గ్రామాల మధ్య శుక్రవారం జరిగిన అగ్నిప్రమాదంలో మూడున్నర ఎకరాలకు సంబంధించి రెండు వరి కుప్పలు, సుమారు నలభై ఎకరాలు చేతికివచ్చిన మొక్కజొన్న పంట దగ్ధమైనట్టు ఏవో కె.రాంబాబు తెలిపారు. ఘటనాస్థలాన్ని పరిశీలించిన ఆయన పంటనష్టం అంచనా వేయాల్సి ఉందని వివరించారు. పరిసరప్రాంతాల వారు తుక్కును తగలబెట్టడం వల్ల అగ్నిప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నామన్నారు.

కాపర్ వైర్ల చోరీపై కేసు నమోదు

టి.నరసాపురం, ఏప్రిల్ 26 : కాపర్ వైర్ల చోరీపై కేసు నమోదు చేశామని ఎస్ఐ డి.దుర్గా మహేశ్వరరావు తెలిపారు. వివరాలివి.. మండలంలోని వల్లంపట్ల, తిరుమలదేవిపేట గ్రామ శివారులోని రైతుల పొలాలలో గల మూడు ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్‌లలోని కాపర్ వైర్లను ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్టు బొర్రంపాలెం ఎలక్ట్రికల్ ఏఈ ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

టెన్త్ టాపర్ మనస్వికి ఎస్పీ అభినందనలు



మనస్విని అభినందిస్తున్న ఎస్పీ, అదనపు ఎస్పీ

ఏలూరు క్రైం, ఏప్రిల్ 26 : టెన్త్ ఫలితాలలో రాష్ట్రస్థాయి ప్రథమ ర్యాంకు సాధించిన ఆకుల వెంకట నాగసాయి మనస్వినిని ఆదర్శంగా తీసుకుని చదు వుపట్ల ముందంజలో ఉండాలని జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి సూచించారు. ముసునూరు మండలం రమణక్క పేటకు చెందిన ఆకుల వెంకట నాగసాయి మనస్విని పదో తరగతి ఫలితాల్లో 599 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు పొందిందన్నారు. ఆమెతో పాటు తల్లిదండ్రులు ఏఎన్‌వీ ప్రసాదరావు, నాగశైలజకు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఐదు వేల రూపాయల నగదు పురస్కారాన్ని, ప్రశంసా పత్రాన్ని అందించారు. అదనపు ఎస్పీ స్వరూపరాణి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, ఆర్ఐ ఏఆర్ పవన్‌కుమార్ పలువురు పాల్గొన్నారు. అనంతరం ఏలూరు అమీనాపేటలోని శ్రీసురేష్ చంద్ర బహుగుణ పోలీస్ ఇంగ్లీషు మీడియం స్కూలులో చదివి పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కు లు సాధించిన ఎనిమిది మంది విద్యార్థులను ఏలూరు జిల్లా పోలీస్ కార్యాల యంలో సన్మానించి ప్రోత్సాహ బహుమతులు, ప్రశంసా పత్రాలను అందించారు.

స్ట్రాంగ్ రూములను పరిశీలించిన ప్రత్యేక అధికారి

బుట్టాయగూడెం/చింతలపూడి, ఏప్రిల్ 26 : బుట్టాయగూడెం మండలం కేఆర్ పురం ఐటీడీఏలో పోలవరం ఎస్టీ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబందించి అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ల పరిశీలన ప్రక్రియను శుక్రవారం పోలవరం నియోజకవర్గ ప్రత్యేక పరిశీలకునిగా నియమితులైన ప్రత్యేకాధికారి ఎస్ఏ రామన్ పరిశీలించారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వచ్చిన ప్రత్యేక అధికారికి రిటర్నింగ్ అధికారి ఎం.సూర్యతేజ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. తొలుత నామినేషన్ల పరిశీలన కార్యక్రమాన్ని పరిశీలించిన అనంతరం స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం కొయ్యలగూడెం మండలంలోని హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ స్టేషన్‌ను సందర్శించి పరిశీలించారు. చింతలపూడి మండలంలోని స్థానిక మార్కెట్‌యార్డులో స్ట్రాంగ్‌రూమ్‌లో ఉంచిన ఈవీఎంల గొడౌన్‌లు, స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద భద్రతను పరిశీలించి అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. రిటర్నింగ్ అధికారి కె.అద్దయ్య, సహాయ ఎన్నికల అధికారి గోపాలకృష్ణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ అసమర్థతతో దెబ్బతిన్న విద్యాప్రమాణాలు

ఏలూరుటూటౌన్, ఏప్రిల్ 26:రాష్ట్రంలో విద్యావ్యవస్థను జగన్ సర్వనాశనం చేశాడని ఏలూరు పార్లమెంట్ టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ డాక్టర్ ఎంబీఎస్.శర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం సమితి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ఎన్నికల్లో విద్యార్థులకు జగన్ ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి నెరవేర్చలేదన్నారు. జగన్ అసమర్థపాలనతో విద్యాప్రమాణాలు దెబ్బతిన్నాయన్నారు. అమ్మఒడి విషయంలో మాట తప్పారని, ఫీజ్ రీయింబర్స్‌మెంట్ చంద్రబాబు హయాంలో 16లక్షల మందికి ఇస్తే వైసీపీ 9 లక్షల మందికే ఇచ్చిందన్నారు. విద్యావ్యవస్థ బాగుపడాలంటే మళ్లీ చంద్రబాబునాయుడిని ముఖ్యమంత్రి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

జనచైతన్యయాత్ర జంగారెడ్డిగూడెం రాక

బుట్టాయిగూడెం, ఏప్రిల్ 26 : ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో నవ్యాంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలను బీజేపీ ప్రభుత్వం అమలు చేయకపోవడం వల్ల రాష్ట్రం తీవ్ర సమస్యలను ఎదుర్కొంటొంది. ప్రజలు తమ సమస్యలను ఎన్నికల్లో ఓట్ల కోసం వచ్చే రాజకీయ పార్టీలను ప్రశ్నించాలని, చేసిన వాగ్దానాలపై అభ్యర్థులను నిలదీయాలని నెల్లూరులో ఈనెల 14న ప్రారంభమైన జనచైతన్య యాత్ర శుక్రవారం జంగారెడ్డిగూడెం చేరుకుంది. ప్రధాన రహదారిలో ప్రచార నిర్వహించి మసీద్ సెంటర్లో వక్తలు ఉపన్యసించారు. ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు సింగోతు నాగేందర్‌రావు, కొండా దుర్గారావు మాట్లాడుతూ ప్రత్యేక హోదాను బీజేపీ ఇవ్వకపోవడం వల్ల పరిశ్రమల స్థాపనకు లభించే రాయితీలు దూరమై పెట్టుబడులు రావడం లేదన్నారు. జన చైతన్య యాత్ర మే 5న శ్రీకాకుళం జిల్లా బొడ్డపాడులో ముగుస్తుందని వారు తెలిపారు. ఏపీ రైతు కూలి సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి జేఎస్ భాస్కర్, నాయకులు కొండా రాము, బి.రమేష్, అఖిలభారత రైతు కూలి సంఘం నాయకులు సాలి రాజశేఖర్, కళాకారులు మన్సూర్ సుధాకర్, ప్రగతిశీల మహిళా సంఘం, పీవోడబ్ల్యూ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై కళాజాత బృందం అవగాహన



కూలీలకు అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

పెదవేగి, ఏప్రిల్ 26 : ఓ టు అనేది రా జ్యాంగం మనకు కల్పించిన హక్కు అని, దానిని సద్వినియోగం చేసుకోవాలని కీర్తన కల్చరల్ సొసైటీ ప్రశాంతకుమార్ అన్నారు. ఓటు నమోదు, వినియోగంపై కీర్తన కళాజాత బృందం పెదవేగి మండలం దుగ్గిరాల, పినకడిమి, అంకన్న గూడెం, బి.సింగ వరం గ్రామాల్లో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఉపాధి కూలీలు, గ్రామ కూడళ్ళలో కళా ప్రదర్శన ద్వారా 18ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేయించుకునే విధానం, ఓటుహ క్కు వినియోగంవంటి వాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాలను అనుసరించి కళా ప్రదర్శనద్వారా ప్రజలకు ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు.

ఇంటర్ స్టేట్ ర్యాంకర్ అజయ్‌రాజుకు సత్కారం

ఉంగుటూరు, ఏప్రిల్ 26 :మండలంలోని నారాయణపురం మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ ఫలితాలలో రాష్ట్రస్థాయి సెకండ్ ర్యాంకు సాధించిన హనుమంతు అజయ్‌రాజును సత్కరించారు. ఆలయ కమిటీ తరపున కూనా అప్పారావు, యండరామదాసు, కొవ్వర్లకోట శ్రీనివాసరావు, విద్యాసాగర శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఒకటి నుంచి వేసవి ఉచిత శిక్షణ తరగతులు

ఏలూరు స్పోర్ట్స్, ఏప్రిల్ 26: బాలికలకు ఆత్మరక్షణకై మే ఒకటో తేదీ నుంచి వైఎంహెచ్ఏ ప్రాంగణంలో కుంగ్‌ఫూ, కరాటేలో శిక్షణ అందిస్తామని వైఎంహెచ్ఏ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం ఏడు గంటల నుంచి 8 గంటల వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఉచిత స్వీయరక్షణ శిక్షణ తరగతులను బాలికలు మాత్రమే అర్హులు అన్నారు.

● వెస్ట్ గోదావరి డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 19 ఏళ్ల బాల బాలికలకు మే 2వ తేదీ నుంచి 22వ వరకు వేసవి క్రీడా శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ కార్యదర్శి వి.వి.ఎస్.ఎమ్ శ్రీనివాసరాజు, అధ్యక్షులు జి.ఆదిత్యవర్మ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ ఏలూరు సీఆర్‌రెడ్డి కళాశాలలో బాలురకు, భీమవరం డీఎన్ఆర్ కళాశాలలో బాలికలకు శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. క్రీడాకారులు జనన ధ్రువపత్రం, ఆధార్ జిరాక్స్‌లు సొంత క్రికెట్ కిట్, డ్రస్ వెంట తెచ్చుకోవాలన్నారు.

ప్రతి ఓటు విలువైనదే

» ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్‌యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న గన్ని

ఏలూరు, ఏప్రిల్ 26 : 'ఏలూరు నియోజక వర్గంలో ప్రతి ఓటరు బూత్‌కు వెళ్లి తమ ఓటు హక్కు వినియోగించుకునేలా పార్టీలో కార్యకర్తలు, నేతలు చొరవ తీసుకోవాలి. ప్రజాస్వామ్యం పరివిడిల్లాలంటే తెలుగుదేశం సంపూర్ణ విజయం సాధించాలంటే ఈ మేరకు అందరూ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి.. ప్రతి ఓటు విలువైనదే' అని కూటమి ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ పిలుపుని చ్చారు. ఏలూరులో శుక్రవారం జరిగిన పార్టీ ముఖ్యులతో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పుడున్న అత్యున్నత సాంకేతిక పద్ధతులను నేరుగా అవగాహన పెంపొందించు కోవడం, వినియోగించుకో వడం అత్యవస రమని ఇదేక్రమంలో ఓటర్లంతా తమ ఓటు హక్కును వినియోగించుకునే బాధ్యత విషయాన్ని గుర్తుచేయాలని విజ్ఞప్తి చేశారు. పోలింగ్ ఏజెంట్లు ఎలా వ్యవహరించాలో కూడా వివరించే ప్రయత్నం చేశారు. ఇదే క్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ ఓటర్లలో అవగాహన పెంచడం తెలుగుదేశం చేపట్టే విధానాలను వివరించడం, వారంతా పోలింగ్ సమయంలో ఆయా బూత్‌లకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాల్సి బాధ్యత అందరిది అన్నారు. సమావేశంలో పుట్టా రవికుమార్ యాదవ్ పాల్గొన్నారు.

పోలవరం, ఉంగుటూరు

జనసేన పార్టీ పరిశీలకుల నియామకం

ఏలూరు క్రైం, ఏప్రిల్ 26 : సార్వత్రిక ఎన్నికల్లో జనసేన పార్టీ పోటీ చేస్తున్న అసెంబ్లీ నియోజకవర్గాలకు పార్టీ ఎన్నికల పరిశీలకులను పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ శుక్రవారం రాత్రి నియమించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఇద్దరు పరిశీలకులను నియమించారు. 19 నియోజకవర్గాలకు ఈ పరిశీలకుల పేర్లుతో జాబితాను శుక్రవారం రాత్రి పార్టీ కార్యాలయం విడుదల చేసింది. ఏలూరు జిల్లాలో జనసేన పోటీ చేస్తున్న పోలవరం అసెంబ్లీ నియోజకవర్గానికి పార్టీ పరిశీలకులుగా రావి సౌజన్య, షైఫోర్స్ మహేష్‌లను నియమించారు. ఉంగుటూరు అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ పరిశీలకులుగా గడసాల అప్పారావు, బీవీఎస్ఎన్ రాజులను నియమించారు.

శ్రీవారిని దర్శించుకున్న ఎన్నికల అబ్జర్వర్



శ్రీధర్‌కు వేదాశీర్వచనం అందిస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 26: చిన్న తిరుమలేశుని ఆలయాన్ని సాధారణ ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ శ్రీధర్ శుక్రవారం ఉదయం సందర్శించారు. ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. ముందుగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేకపూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనం అందజేశారు. అధికారులు శ్రీవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

న్యాయమే గెలిచింది : గరిమెళ్ల

లింగపాలెం, ఏప్రిల్ 26: వైసీపీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పికొట్టాలని ఎప్పటికైనా న్యాయమే గెలుస్తుందని లింగపాలెం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గరిమెళ్ళ చలపతిరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతలపూడి నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ కూటమి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్‌పై వైసీపీ నాయకులు చేస్తున్న అసత్యప్రచారాలను ఆయన ఖండించారు. టీడీపీ గెలుపు తథ్యమని వైసీపీ ఓటమిని తట్టుకోలేకనే నియోజకవర్గ వైసీపీ నాయకులు ఇటువంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. మోరంపూడి మల్లిఖార్జున్‌రావు, తాడేపల్లి దాసు, పల్లి శ్రీను,అసిలేటి అజయ్, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మేడే కార్యక్రమాలను జయప్రదం చేయాలి

ఏలూరు రూరల్/బుట్టాయగూడెం, ఏప్రిల్ 26: వీవీ నగర్ ఏరియా మార్కెట్‌యార్డు హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మేడే కార్యక్రమాలు జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం మార్కెట్ యార్డులో కరపత్రాలు ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. యూనియన్ గౌరవాధ్యక్షుడు, కార్యదర్శి రెడ్డి అప్పలనాయుడు, యర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ మోదీ మతోన్మాద విధానానికి వ్యతిరేంగా దేశవ్యాప్తంగా జరగబోవు మే ఒకటో తేదీన మేడే కార్యక్రమాలను కార్మిక అడ్డాలలో జెండాలు ఎగురవేయాలని పిలుపునిచ్చారు. బుట్టాయగూడెం మండలం కేఆర్‌పురంలో ఇఫ్టూ రాష్ట్ర కోశాధికారి కేవీ రమణ ఆధ్వర్యంలో సివిల్ సప్లై హమాలీ నాయకుడు కొర్స కిషోర్ మేడే కరపత్రాలను ఆవిష్కరించారు. ఎం.ఏసు, డి.రాజు, కె.రాజేష్, కె.రవివర్మ, పి.అనిల్, కె.చందు తదితరులు పాల్గొన్నారు.

భువ్వనపల్లిలో జనసేనలోకి భారీ చేరికలు

నిడమర్రు, ఏప్రిల్ 26 :వైసీపీ అరాచక పాలన కంటే మెరుగైన అభివృద్ధితోకూడిన సంక్షేమపాలన కూటమి ప్రభుత్వం తోనే సాధ్యమని ఉంగుటూరు కూటమి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శుక్రవారం భువ్వనపల్లిలో అధికార వైసీపీ నుంచి పలువురు సీనియర్ వైసీపీ నాయకులు కూటమి అభ్యర్థి ధర్మరాజు, వట్టి పవన్ సమక్షంలో పార్టీలో చేరారు. వారికి జనసేన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామానికి చెందిన సంకు శ్రీనివాసరావు, అలుమోలు శ్రీనివాసరావు, అలుమోలు రాంబాబు, అలుమోలు చిన్నా, గంగరాజు, అలుమోలు ధర్మారావు, ఆళ్ళ రాంబాబు, గోపి, గాజుల నాగేశ్వరరావు జనసేన తీర్థం పుచ్చుకున్నారు. జనసేన పార్టీలో చేరిన ప్రతి ఒక్కరూ కూటమి అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని వట్టి పవన్ పిలుపునిచ్చారు.

30న పవన్ సభను విజయవంతం చేయాలి

కొయ్యలగూడెం, ఏప్రిల్ 26: కొయ్యలగూడెంలో ఈనెల 30న పవన్‌కల్యాణ్ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఉమ్మడి అభ్యర్థి చిర్రి బాలరాజు, జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి తెలిపారు. ఈ మేరకు కొయ్యలగూడెంలోని పలు ప్రాంతాల్లో హెలీప్యాడ్‌కు అనుకూలంగా ఉన్న ప్రాంతాలను శుక్రవారం పరిశీలించారు. నియోజకవర్గంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు.

ఉంగుటూరులో ముగ్గురు వలంటీర్ల రాజీనామా

ఉంగుటూరు, ఏప్రిల్ 26 :ఉంగుటూరు మండలంలో శుక్రవారం ముగ్గురు వలంటీర్లు రాజీనామా చేశారని ఎంపీడీవో శర్మ తెలిపారు. గొల్లగూడెం, కంసాలిగుంట, నాచుగుంట గ్రామాలలో ఒక్కొక్కరు చొప్పున రాజీనామా చేశారని ఆయన తెలిపారు.

పశువుల దాహార్తిని తీర్చేందుకే 'చెలం'



కుక్కునూరు, ఏప్రిల్ 26 : వేసవి మండుతోంది. వాగులు వంకల్లో నీరు ఎండిపోయింది. పశువుల దాహార్తి కోసం అల్లాడిపోతున్నాయి. ఈ క్రమంలో పశువులు నీళ్ల కోసం పడుతున్న పాట్లు చూసి తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు స్పందించారు. నల్లకుంట గ్రామసమీపంలో గుండేటివాగులోని ఇసుకను తవ్వి భారీ చెలం ఏర్పాటు చేశారు. దీంతో పశువుల దాహార్తి తీరనుంది. కొన్నేళ్లుగా ప్రతి ఏడాది వేసవికాలంలో పశువుల దాహార్తిని తీర్చేందుకు ఈవిధంగా వాగులో చెలం ఏర్పాటు చేస్తున్నారు. టీడీపీ నాయకులు రమణరాజు, శీలం లక్ష్మయ్య, వెంకన్న పాల్గొన్నారు.

రేపు సినీ సంగీత లహరి

ఏలూరు కల్చరల్, ఏప్రిల్ 26: ఎస్‌పీఎస్ మ్యూజిక్ అకాడమి, ఎస్‌పీఎస్ మ్యూజిక్ స్టూడియో సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన వై.ఎంహెచ్ఏ ప్రాంగణంలో పాడుతా తీయగా గ్రాండ్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా సినీ సంగీత లహరి ఏర్పాటు చేశామని సంగీత దర్శకులు ఎస్‌పీఎస్ వాసు, కో-ఆర్డినేటర్ వహిదావాసు తెలిపారు. కార్యక్రమానికి ప్రముఖ వయోలిన్ విద్వాంసులు బాలాజీ బృందం, సరిగమ ఫేమ్ ఆర్టిస్ట్ సుధారాణి, పాడుతా తీయగా విజేత రసూల్‌బాబు ముఖ్య అతిథిగా విచ్చేస్తారని, అనంతరం బెస్ట్ సింగర్స్‌ను ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమ అనంతరం పలు గాయనీ గాయకులతో సినీసంగీత లహరి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎన్నికల స్పెషల్

ఓటు.. ఎంతెంత దూరం!



మూడు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిందే

ప్రతీ సాధారణ ఎన్నికల్లో మండుటెండలో మూడు కిలోమీటర్ల దూరం వెళ్లి దళితవాడ ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోవాల్సి వస్తున్నది. గ్రామ పంచాయతీ ఎన్నికలకు స్థానికంగానే పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేస్తున్న అధికారులు లోక్ సభ, శాసనసభ ఎన్నికలకు మాత్రం మూడు కిలోమీటర్లు నడిపిస్తున్నారు. కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో మారుమూలన ఉన్న ముదినేపల్లి మండలం పేరూరు శివారు తేరగూడెం దళితవాడ ఓటర్లు ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఎదుర్కొంటున్న ఇబ్బందులు వర్ణనాతీతం. తమ దళితవాడ నుంచి పేరూరు పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓట్లు వేయాలి. దళితవాడలో 120 మంది ఓటర్లు ఉన్నారు. అధ్వాన్నపు రోడ్డుపైన నడుచుకుంటూ వెళ్లి ఓటు వేయటం ఇబ్బందికరంగానే ఉంది.

- ముదినేపల్లి

ఆ బ్యాలెట్‌లో ఏ గుర్తు ఉండదు

పోస్టల్ బ్యాలెట్‌లో టిక్‌లు పెట్టాలి



పోలింగ్ బూత్‌లో ఓటు వేసేందుకు గతంలో పేపర్ బ్యాలెట్‌పై పార్టీల గుర్తులు ఉండేవి. ఇప్పుడు ఈవీఎంలపై కూడా గుర్తులు ఉంటున్నాయి. నచ్చిన పార్టీ అభ్యర్థి పేరు వద్ద ఉన్న గుర్తుపై మీట నొక్కాలి. ప్రభుత్వ ఉద్యోగులు, ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రైవేట్ వ్యక్తులు ఓటు వేయవచ్చు. వారికి పోస్టల్ బ్యాలెట్ ఇస్తారు. ఈ బ్యాలెట్‌పై పార్టీల గుర్తులు ఉండవు. కేవలం అభ్యర్థి, పార్టీ పేర్లు మాత్రమే ఉంటాయి. ఇంతకు ముందు బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ జరిగే సమయంలో సాధారణ ఓటర్లకు ఇచ్చే బ్యాలెట్ పేపర్‌నే ఉద్యోగులకూ ఇచ్చే వారు. ఈవీఎంలు వచ్చాక ఉద్యోగులు, ఎన్నికల విధుల్లో పాల్గొనే ఇతరులు యంత్రంలో ఓట్లు వేసే అవకాశం లేకపోవడంతో పోస్టల్ బ్యాలెట్‌ను ఏర్పాటు చేశారు. ఈ బ్యాలెట్‌పై అభ్యర్థి పేరు, పార్టీ పేరు ముద్రిస్తారు. గుర్తు ఉండదు. బ్యాలెట్‌పై అభ్యర్థి పేరు పక్కన టిక్ పెట్టాల్సి ఉంటుంది.

- ముదినేపల్లి

ఎక్కువ మంది అభ్యర్థులు ఉంటే..

రెండో ఈవీఎం వినియోగం



అసెంబ్లీ ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్ల స్థానంలో ఈవీఎం(ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషిన్‌ను) ఉపయోగిస్తుంటారు. ఒక నియోజకవర్గంలో 16 మంది కంటే ఎక్కువ అభ్యర్థులు పోటీలో ఉంటే రెండు ఈవీఎంలను ఉపయోగించ వలసి ఉంటుంది. ఒక ఈవీఎంలో 15మంది అభ్యర్థులు ఒక నోటా కలిపి 16మంది వివరాలు నమోదు చేసుకునే వీలు మాత్రమే ఉంటుంది. అంతకంటే ఎక్కువ మంది బరిలో ఉంటే తప్పకుండా మరో ఈవీఎంను ఉపయోగించాలి. కైకలూరు నియోజకవర్గంలో నామినేషన్ల ప్రక్రియ ముగిసేసరికి 44 మంది అభ్యర్థులు దాఖలు చేశారు. ఉపసంహరణ తర్వాత కూడా వారంతా పోటీలో ఉంటే రెండు ఈవీఎంలు అవసరమని స్థానికంగా చర్చనీయంశంగా మారింది. మొదటి ఈవీఎంలో 16 మంది రెండో ఈవీఎంలో 16మంది అంతకంటే ఎక్కువ ఉంటే మరో ఈవీఎంలో అభ్యర్థుల వివరాలు నమోదు చేస్తారు. ఏ పోలింగ్ బూత్‌లో అయిన ఎన్నికల ప్రక్రియ మొదలైన తరువాత ఈవీఎం మొరాయిస్తే అప్పటివరకు నమోదైన వివరాలను సీజ్ చేసి రెండో ఈవీఎంను ఉపయోగిస్తారు.

- కైకలూరు

తెలుసుకుందాం..

బైండోవర్ అంటే ..



ఎన్నికలు ఎప్పుడు వచ్చిన తరచూ వినిపించే మాట బైండోవర్.. అనగా బాండ్ ఫర్ గుడ్ బిహేవియర్. ఎన్నికల జరుగుతున్న సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై అధికారులు ప్రత్యేక నిఘా పెడతారు. అలాగే గొడవలు సృష్టించే వారు, రౌడీషీటర్లు, బెల్టు దుకాణ దారులు, ముఖ్యంగా అసాంఘిక శక్తులపై నిఘా ఉంచుతారు. ఎన్నికల సమయంలో పలానా వ్యక్తుల వలన సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని గ్రహిస్తే అతడి చర్యలు అనుమానాస్పదంగా ఉన్నాయని రుజువైతే పోలీసులు బైండోవర్ చేస్తారు. అటువంటి వారిని తహసీల్దార్, ఆర్‌డీవో ఎదుట హాజరుపరుస్తారు. ఎన్నికల సమయంలో చట్ట వ్యతిరేక చర్యలు చేయబోమని బాండ్ పేపర్ మీద రాతపూర్వకంగా హామీ తీసుకుంటారు. అలా బైండోవర్ అయిన వ్యక్తి ఆ రోజు నుంచి సంవత్సరం పాటు ఎలాంటి నేరాలకు పాల్పడకూడదు. అలా పాల్పడితే ఇచ్చిన బాండ్ ఎంత మొత్తం నగదు నమోదు చేసి ఉంటారో అంత మొత్తం జరిమానా చెల్లించాలి. అలా చెల్లించకపోతే నేరంగా పరిగణిస్తారు. అతడిపై ఐపీసీ సెక్షన్లు 106, 107, 108, 110 కింద కేసు నమోదు చేస్తారు. అలాగే రెండు అంత కన్న ఎక్కువ సార్లు బైండోవర్ అయితే రౌడీషీట్ నమోదు చేసే అవకాశం ఉంది. అక్రమంగా పోలీసులు బైండోవర్ పెట్టారని ఎవరైనా భావిస్తే హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చు.

-గణపవరం

క్రైం వార్తలు

మొదటి భార్య ఫిర్యాదుపై..

భర్త మృతదేహం స్వాధీనం



నాగబాబు(ఫైల్)

ముదినేపల్లి, ఏప్రిల్ 26 : భర్త మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ మృతుడి మొదటి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు రంగంలోకి దిగి అంత్యక్రియలకు సిద్ధం చేస్తున్న మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న ఘటన ముదినేపల్లి మండలం గురజ గ్రామంలో జరిగింది. దీనిపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఎస్‌ఐ డి.వెంకట్ కుమార్ కథనం ప్రకారం గురజకు చెందిన కొంగల నాగబాబు (33)కు 2014లో మండవల్లి మండలం నందిగామ లంక గ్రామానికి చెందిన మనీషతో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. అయితే మనస్పర్థలతో వారు నాలుగేళ్ల క్రితం విడిపోయారు. నాగబాబు 2020లో సింగవరానికి చెందిన యువతిని రెండో పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఒక పాప. ఈ పరిస్థితుల్లో గురువారం నాగబాబు గుడివాడ వెళ్లి తిరిగి ఇంటికి వచ్చాడు. మధ్యాహ్నం తన ఇంటిలో అతడు ఉరి వేసుకుని మృతి చెంది ఉండటాన్ని కుటుంబీకులు గుర్తించారు. ఈ సమాచారం మొదటి భార్యకు తెలియజేయగా, ఆమె గురజ వచ్చి తన భర్త మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ ముదినేపల్లి పోలీసులకు గురువారం రాత్రి ఫిర్యాదు చేసింది. దీంతో శుక్రవారం ఉదయం పోలీసులు విచారణకు గ్రామానికి వెళ్లే సరికి శ్మశాన వాటికకు తీసుకెళ్లి అంత్యక్రియలకు సిద్ధమవుతుండగా, మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టంకు గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బావమరిదిపై దాడి

ముసునూరు, ఏప్రిల్ 26: చెల్లిని చూసేందుకు వచ్చిన సోదరుడు, అతని భార్యపై బావ ఐరన్ రాడ్డుతో దాడి చేసిన ఘటనపై ఎస్‌ఐ పి.వాసు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం చింతలపూడి మండలం ప్రగడవరానికి చెందిన బొబ్బిలి రవికుమార్, అతని భార్య ఈ నెల 24న నూజివీడు మండలం ముక్కొల్లుపాడులో తమ బంధువుల ఇంటిలో వివాహానికి వచ్చి వివాహం చూసుకుని ముసునూరులో ఉన్న తన చెల్లెలు యలమర్తి వరలక్ష్మిని చూసేందుకు వెళ్లారు. అయితే పాత గొడవలను దృష్టిలో పెట్టుకుని రవికుమార్, అతని భార్యపై బావ యలమర్తి రంగారావు ఐరన్ రాడ్‌తో దాడిచేయగా, రవికుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు నూజివీడు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు యలమర్తి రంగారావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వాసు తెలిపారు.

ఎండిన చెరువులు.. గ్రామాల్లో

దాహం.. దాహం..

వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు అధికారులు పూర్తిస్థాయిలో మంచినీటి చెరువులు నింపడంలో విఫలమయ్యారు. ఈ ఏడాది మార్చి నెల నుంచే ఎండలు విపరీతంగా పెరిగి ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. అనేక గ్రామాల్లో తాగునీరు లేక ఇబ్బందులకు గురవుతున్నారు. తాగునీరు అందించడంలో అధికారులు చిత్తశుద్ధి చూపకపోవడంతో ప్రజలకు ఈ ఏడాది తాగునీటి కష్టాలు తప్పేలా లేవు.

- కాల్వలకు నీటి విడుదలలో అధికారుల నిర్లక్ష్యం
- పూర్తిస్థాయిలో నిండని చెరువులు
- కైకలూరులో రోజు విడిచి రోజు నీటి సరఫరా
- తక్కెళ్ళపాడులో ఎండిన చెరువు



తక్కెళ్ళపాడులో నీరు లేని మంచినీటి చెరువు



ఎండిపోయిన కైకలూరు పంటకాలువ

కైకలూరు, ఏప్రిల్ 26: కాలువలకు అరకొర నీటి విడుదల చేసి అనేక గ్రామాల్లో మంచినీటి చెరువులు సగభాగం మాత్రమే నింపి అధికారులు చేతులు దులుపుకున్నారు. నిరంతరంగా కాలువలకు నీరు అందిస్తేనే మంచినీటి చెరువులు నిండే పరిస్థితి ఉన్నప్పటికీ ఆ దిశగా ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు దారితీస్తోంది. ఎగువ నుంచి కాలువలకు నీరు విడుదల చేసినా కాలువల సామర్థ్యం మేరకు నీరు విడుదల చేయకపోవడంతో మంచినీటి చెరువులు పూర్తిస్థాయిలో నిండలేదు. ప్రధానంగా కైకలూరు పట్టణంలో 50 వేల జనాభాకు 37 ఎకరాల మంచినీటి చెరువులు ఉండగా 60 శాతం మాత్రమే నింపగలిగారు. ఇప్పటికే గత నెల రోజులుగా కైకలూరు పట్టణ ప్రజలకు రోజు విడిచి రోజు నీటి సరఫరా చేస్తున్న సంగతి తెలిసిందే. కాలువలు వచ్చాయి. మంచినీళ్ళు వస్తాయి అన్న ప్రజలకు ఇప్పటికే రోజు విడిచి రోజు నీరు అందించడంతో ప్రజలు ఇరిగేషన్ అధికారుల తీరుపై మండి పడుతున్నారు. ఎగువ నుంచి నీరు వచ్చినా కైకలూరుకు వచ్చే కాలువలు పోల్‌రాజ్‌కు పూర్తిస్థాయిలో నీరు విడుదల చేయకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొంది. కైకలూరులో నీరు కుళాయిల ద్వారా సరఫరా కాకపోతే ప్రజలు తాగేందుకు, కనీస అవసరాలు తీర్చుకునేందుకు కూడా నీరు దొరకని పరిస్థితి. అయినప్పటికీ ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నీటిని అందించకపోవడంతో ఈ ఏడాది ప్రజలు నీటి కోసం యుద్ధాలు చేయవలసిన పరిస్థితి నెలకొంది. ఇప్పటివరకు చెరువుల్లో నింపిన నీరు నెల రోజులు మాత్రమే వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. అలాగే కైకలూరు మండలంలోని పల్లెవాడ మంచినీటి చెరువు 50 శాతం, నరసాయిపాలెం 60 శాతం, వదర్లపాడు 60 శాతం మాత్రమే మంచినీటి చెరువులు నింపగలిగారు. అలాగే మండవల్లి మండలంలోని తక్కెళ్ళపాడు సామూహిక రక్షిత మంచినీటి పథకానికి ఉన్న మంచినీటి చెరువులో 20 శాతం మాత్రమే నీరు ఉంది. ఈ మంచినీటి పథకం ద్వారా 10 గ్రామాలకు మంచినీరు సరఫరా చేయవలసి ఉంది. కాలువలకు నీరు విడుదల చేయడంలో కైకలూరు ప్రాంతం వివక్షకు గురైందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో అనేక చేపల చెరువులు ఉన్నప్పటికీ కనీస అవసరాలు తీరని ఆ నీటితో ఈ వేసవిని గట్టెక్కించేదెలా అంటూ వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు కాలువలు సామర్థ్యం మేరకు నీటి విడుదల చేసి మంచినీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



లింగాలలో కామినేని తరఫున టీడీపీ నాయకుల ప్రచారం



బొమ్మినంపాడులో కామినేని సోదరి, కుటుంబీకుల ప్రచారం

టీడీపీ వస్తేనే.. పరిశ్రమలు వచ్చేది

మండవల్లి, ఏప్రిల్ 26: పరిశ్రమల స్థాపన టీడీపీతోనే సాధ్యమని టీడీపీ నాయకుడు కొడాలి వినోద్ అన్నారు. శుక్రవారం మండవల్లి మండలం అల్లి నగరం, లింగాల గ్రామాల్లో కూటమి నాయకులు ఇంటింటికి తిరుగుతూ కైకలూరు కూటమి అసెంబ్లీ అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌కు కమలం గుర్తుపై, టీడీపీ ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్‌యాదవ్‌కు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. టీడీపీ ప్రభుత్వం వస్తే రాష్ట్రం అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. వైసీపీ ఐదేళ్ళ పాలనలో అనేకమంది ఉన్నత చదువులు చదివినా ఉద్యోగాలు లేక పొరుగు రాష్ట్రాలకు వలస పోతున్నారన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు నారగాని నాగేశ్వరరావు, నాయకులు వీరమల్లు నరసింహారావు, ఎలికే రాంబాబు, చాబత్తిన విజయ్, పళ్లెం ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

కామినేని సోదరి ప్రచారం

ముదినేపల్లి: మండలంలోని బొమ్మినంపాడులో కైకలూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ సోదరి రుద్రమదేవి, బంధువులు కుమారి, శైలజ శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించి ఓట్లు అభ్యర్థించారు. టీడీపీ నాయకులు యెర్నేని కిషోర్, డాక్టర్ ఈడ్పుగంటి శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ భూపతి నాగ కళ్యాణి, బొమ్మినంపాడు సర్పంచ్ దారం సుధ, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు యర్రా రాంబాబు, బాసినశెట్టి కిషోర్, యర్రా నాని, కేనం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కైకలూరు నియోజకవర్గం నుంచి ఎన్‌డీఏ అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌ను, ఏలూరు ఎంపీ అభ్యర్థి మహేష్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు.

కలిదిండి: కోరుకొల్లులో శుక్రవారం కూటమి నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కైకలూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌కు కమలం గుర్తుపై, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్‌కు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఇంటింటికి వెళ్లి మేనిఫెస్టో అందజేసి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కూటమి నాయకులు కేశిరెడ్డి బలరామ్, చెన్నంశెట్టి మురళీకృష్ణ, బట్టు లీలా కనకదుర్గ, వలవల రమేష్, నున్న సుబ్రహ్మణ్యం, కేశిరెడ్డి రాజేష్, ఆముజాల శ్రీరామసాయి తదితరులు పాల్గొన్నారు.

బాబును మళ్ళీ రప్పిద్దాం..

కైకలూరు: అధిష్ఠానం ఆదేశాలతో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో బాబును రప్పిద్దాం కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం కైకలూరులో టీడీపీ వస్తే అందించే సంక్షేమ పథకాలు ప్రజలకు తెలియజేశారు. దీనిలో టీడీపీ నేతలు కెకె బాబు, వీరాబత్తిన సుధా, సయ్యద్ బషీద్, లక్కింశెట్టి మోహన్, బాజానీ, కుర్మా నవీన్, సయ్యద్ బషీర్, పేరం వంశీ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



బత్తులవారిగూడెంలో కొలుసు పార్థసారథి ప్రచారం

దళిత కాలనీల్లో అభివృద్ధి శూన్యం

నూజివీడు టౌన్, ఏప్రిల్ 26: గిరిజన, దళిత వర్గాలు వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయని, నూజివీడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు మండలం బత్తులవారి గూడెం, యనమదల, సుంకొల్లు గ్రామాల్లో ఆయన పర్యటించి మాట్లాడుతూ గిరిజన, దళిత కాలనీలు గత ఐదేళ్లలో ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కనీసం కచ్చా డ్రైన్‌ను కూడా నిర్మించలేదన్నారు. జగన్‌రెడ్డి సంక్షేమ పథకాల పేరుతో ఒక చేత్తో పంచి మరో చేత్తో పన్నుల రూపంలో, మద్యం రూపంతో పేదల శ్రమను దోచుకున్నారన్నారు. మద్యనిషేదం అమలు చేస్తానన్న జగన్‌రెడ్డి రెట్టింపు ధరలతో అమ్మకాలు కొనసాగిస్తూ నాసిరకపు మద్యాన్ని అమ్మడంతో అనేక మంది అక్కాచెల్లెమ్మలు పసుపు, కుంకాలకు దూరమయ్యాయన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్న ఎమ్మెల్యే ప్రతాప్ చింతలపూడి ఎత్తిపోతలను అటకెక్కించినా మాట్లాడకుండా రైతులకు ద్రోహిగా మారాడన్నారు.

ఆగిరిపల్లిలో సారథి సతీమణి ప్రచారం

ఆగిరిపల్లి: నూజివీడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి సతీమణి లక్ష్మీ కమల శుక్రవారం యాదవ బజారులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చంద్రబాబును సీఎం అయితే చేకూరే ప్రయోజనాలు, సూపర్ సిక్స్ పథకాలపై వివరించారు.



ఏలూరు సమావేశంలో ఎంపీ అభ్యర్థి పుట్టాతో మోరంపూడి

పుట్టాను కలసిన తెలుగు తమ్ముళ్లు

చాట్రాయి, ఏప్రిల్ 26: ఏలూరులో శుక్రవారం జరిగిన టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జిల సమావేశానికి, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి, క్లస్టర్ ఇన్‌చార్జి మోరంపూడి శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ ఎన్నికలో కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ఏ విధంగా క్యాడర్ పనిచేయాలి అనే అంశంపై జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ దిశానిర్దేశం చేశారని మోరంపూడి చెప్పారు.



ముదినేపల్లి: ఏలూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి పుట్టా యాదవ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులును కైకలూరు నియోజకవర్గ పార్టీ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు తదితర నాయకులు శుక్రవారం ఏలూరులో కలిశారు. పార్టీ బలోపేతం, ఎన్‌డీఏ కూటమి అభ్యర్థుల విజయానికి చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. టీడీపీ జిల్లా కార్యదర్శి పోసిన పాండు రంగారావు, పార్టీ నాయకులు వీరమల్లు సత్యనారాయణ వారిని కలసి కూటమి అభ్యర్థుల విజయానికి సమిష్టి కృషి చేస్తామని తెలిపారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్

అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు

ముసునూరు, ఏప్రిల్ 26: అక్రమ రవాణాకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ హెడ్ పోలిశెట్టి శ్రీనివాసరావు హెచ్చరించారు. శుక్రవారం ముసునూరు, వలసపల్లి, రమణక్కపేట, వేల్పుచర్ల గ్రామాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం విస్తృతంగా వాహనాల తనిఖీ నిర్వహించింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ అక్రమంగా మద్యం, నగదు, ఇతర తాయిలాలు రవాణా చేస్తే చర్యలు తప్పవని, ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు.

హైవేపై స్టాప్ బోర్డుల ఏర్పాటు

చాట్రాయి, ఏప్రిల్ 26: ఆంధ్ర-తెలంగాణ రహదారి, విజయవాడ-సత్తుపల్లి స్టేట్ హైవేలో మండలంలోని సూరంపాలెం, చనుబండ గ్రామాల వద్ద ప్రమాదాలు జరగకుండా శుక్రవారం ఎస్సై కేసీహెచ్ స్వామి స్టాప్ బోర్డులు ఏర్పాటు చేశారు. గతంలో ప్రమాదాలు జరిగిన ప్రదేశాలు, అందుకు కారణాలు గుర్తించి స్టాప్ బోర్డులు ఏర్పాటు చేశామని, వాహన చోదకులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.



కవాతు నిర్వహిస్తున్న సాయుధ బలగాలు

సాయుధ బలగాల కవాతు

ఆగిరిపల్లి, ఏప్రిల్ 26: ఎన్నికలు సమీపిస్తున్నందున ఆగిరిపల్లిలో కేంద్ర సాయుధ బలగాలతో ప్రధాన వీధుల్లో గురువారం అర్ధరాత్రి కవాతు నిర్వహించారు. ఆగిరిపల్లిలో ఎస్సై సురేంద్రబాబు ఆధ్వర్యంలో ఈ కవాతు నిర్వహించినట్లు ఏఎస్సై తవేరియా నాయక్ తెలిపారు.



ఉపాధి పనులను పరిశీలిస్తున్న అధికారి (ఫైల్)

సామాజిక తనిఖీకి బ్రేక్

- కోడ్ ఎఫెక్ట్
- పనుల్లో నాణ్యత గుర్తింపు లేనట్టే?

ముదినేపల్లి, ఏప్రిల్ 26 : ఉపాధి పనుల సామాజిక తనిఖీలు కోడ్ కారణంగా నిలిచిపోయాయి. 2023-24 సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులకు గ్రామాల్లో సామాజిక తనిఖీలు నిర్వహించి త్వరలో మండల స్థాయిలో పబ్లిక్ ఆడిట్ నిర్వహించాల్సి ఉంది. ముదినేపల్లి మండలంలో గత ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు సుమారు రూ.12 కోట్ల విలువైన 1120 ఉపాధి పనులు నిర్వహించారు. పనులు నిర్వహించిన తీరు తెన్నులపై ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా గ్రామస్థాయిలో రిసోర్స్ పర్సన్స్ సోషల్ ఆడిట్ నిర్వహించాల్సి ఉంది. అయితే కోడ్ అమల్లో ఉండ టంతో ఈ ఆడిట్ నిర్వహిస్తే గ్రామాల్లో రాజకీయ పరిణామాలు చోటు చేసుకుంటాయన్న కారణంగా ఈ పథకం ఉన్నతాధికారులు సామాజిక తనిఖీ లు నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఏడాది కాలంగా జరిగిన పనుల నాణ్యతను గుర్తించటం ఇప్పటికే కష్టమయ్యే పరిస్థితుల్లో కోడ్ ముగిసే వరకు సుమారు 40 రోజులపాటు సామాజిక తనిఖీలు జరిగే అవకాశం లేదు. అంటే తిరిగి రెండు నెలల వరకు తనిఖీలు నిర్వహించటం కుదరదు. కాబట్టి పనుల నాణ్యతను గుర్తించే అవకాశం ఉండదు.



గుడిపాడులో కార్మికులకు సూచనలిస్తున్న ఉప కమిషనర్ శ్రీనివాస్

కార్మికులు జాగ్రత్తలు పాటించాలి

ముసునూరు, ఏప్రిల్ 26: వేసవిలో భవన నిర్మాణ, కర్మాగారాల్లో పనిచేసే కార్మికులు, దుకాణాలు, ఫ్యాక్టరీల్లో పనిచేసేవారు తగు జాగ్రత్తలను తీసుకోవాలని జిల్లా కార్మిక ఉప కమిషనర్ పి.శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో కార్మికులతో ఆయన సమావేశమై పలు సూచనలిచ్చారు. ఓఆర్‌యస్, ప్రథమ చికిత్స సామగ్రి పని ప్రదేశాల్లో ఉంచుకోవాలని, ఆరోగ్యశాఖాధికారుల సమన్వయంతో కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకునేలా యాజమాన్యాలు చూడాలన్నారు. అలాగే రాష్ట్ర విపత్తు నివారణ సంస్థ జారీ చేసే సూచనలు తప్పకుండా పాటించాలని సూచించారు.

ఖరీఫ్‌కు సన్నద్ధం కావాలి



సమీక్షలో మాట్లాడుతున్న ఏడీ విద్యాసాగర్

నూజివీడు టౌన్, ఏప్రిల్ 26: వేసవి దుక్కుల ద్వారా ఖరీఫ్‌కు సన్నద్ధం కావాలని, నూజివీడు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు జి.విద్యాసాగర్ అన్నారు. నూజివీడులోని తన కార్యాలయంలో ఖరీఫ్ సీజన్‌కు సన్నద్ధత, ప్రస్తుత రబీలో పండిన ధాన్యం కొనుగోలుకు సంబంధించి సమీక్షా సమావేశాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో అవసరమైన ు, ఎరువులు, పురుగు మందులు కావాల్సిన పరిమాణంలో మండల అధికారులు సమకూర్చుకునేందుకు చర్యలు చేపట్టాలన్నారు. నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి మండలాల వ్యవసాయాధికారులు ఎ.చాముండేశ్వరి, చెన్నారావు, మధుమోహన్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



స్నేహితుడి కుటుంబానికి చేయూత

చాట్రాయి, ఏప్రిల్ 26: చనుబండలో విస్సంపల్లి కృష్ణ (42) ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా, అతనితో కలిసి చనుబండ హైస్కూల్‌లో పదో తరగతి వరకు చదువుకున్న స్నేహితులు తమ సాయంగా రూ. 51,500 శుక్రవారం మృతుడి కుటుంబానికి అందజేశారు. కొన్నేళ్ళ నుంచి తాము ఒక గ్రూపుగా ఏర్పడి స్నేహితులలో ఎవరికి ఆపద వచ్చిన ఐక్యంగా సాయం అందిస్తున్నట్టు వారు చెప్పారు.

బంగారు నాణెం అందజేత



నూజివీడు టౌన్, ఏప్రిల్ 26: పాడిరైతు కుటుంబాల్లో వివాహానికి సంబంధించి కృష్ణామిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో నాలుగు గ్రాముల బంగా రు నాణేన్ని నూజివీడు మండలం అన్నవరం మహిళా పాల కేంద్రం పాడిరైతు గోళ్ళ పద్మావతికి శుక్రవారం అందించారు. 180 రోజుల్లో 180 లీటర్లకు పైగా పాలను వరుసగా మూడేళ్లు పోసిన వారి కుటుంబాల్లో వివాహ సమయంలో విజయ డెయిరీ బంగారు నాణాన్ని కానుకగా అందిస్తున్నట్లు పాల సొసైటీ అధ్యక్షురాలు కుంపటి శశిరేఖ అన్నారు. మిల్క్ చిల్లింగ్ సెంటర్ మేనేజరు మాగంటి హరిబాబు, రూట్ సూపర్‌వైజర్ పొన్నగంటి గణేష్, వేతన కార్యదర్శి కొలుసు గంగాధర్‌రావు, పాడి రైతులు పాల్గొన్నారు.

చాట్రాయి: మండలంలోని టి. గుడిపాడు పాల సహకార సంఘం సభ్యురాలు నందిపాము స్వరూపరాణి కుమారుడు రవీంద్రబాబు వివాహం సందర్భంగా, కృష్ణామిల్క్ యూనియన్ కల్యాణమస్తు పథకం కింద రూ 20వేలు విలువైన బంగారు నాణేన్ని శుక్రవారం సంస్థ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు, సంఘ అధ్యక్షురాలు బలుసు రాజ్యలక్ష్మి పెండ్లి కుమారుడికి అందజేశారు. కార్యక్రమంలో పాడిరైతులు సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



ముస్లిం విద్యార్థులకు ప్రోత్సాహం

ఆగిరిపల్లి, ఏప్రిల్ 26: 10వ తరగతిలో 500 కన్నా ఎక్కువ మార్కులు సాధించిన ముస్లిం విద్యార్థులకు ఆగిరిపల్లి మక్కా మసీదులో మసీదు అధ్యక్షుడు షేక్ గౌస్, కార్యదర్శి షేక్ అబ్దుల్‌హక్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రూ. 500లు ప్రోత్సాహక బహుమతితో పాటు, మెమెంటోలు అందజేశారు. పలువురు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.